పక్కా తెలుగు

ప్రభాత
కిరణమ్
సత్యానికి వారధి

PRGI REGD No.: TGTEL/26/A4986

5 DOTS NETWORK

అమరావతి | సంపుటి : 01 | సంచిక : 006 | మంగళవారం | 30-06-2026 | పేజీలు : 08 | వెల: రూ.4/- www.prabhathakiranam.com

Amaravathi | Volume : 01 | Issue : 006 | Tuesday | 30-06-2025 | Pages: 08 | Price : Rs.4/- Circulated to Telangana | Published from Medchal Malkajgiri



భక్తి ముసుగులో భూబకాసురులు

• దేవుడి పేరుతో దందా.. • ప్రభుత్వ భూములు గోవిందా

• బద్వేలులో గుడి పేరుతో కబ్జాల కొత్త ఎత్తుగడ

భూమి అంటే విలువ. ప్రభుత్వ భూమి అంటే ప్రజల ఉమ్మడి ఆస్తి. ఒకప్పుడు రాజకీయ అండ, నకిలీ పత్రాలే భూకబ్జాలకు ప్రధాన ఆయుధాలైతే, ఇప్పుడు వాటికి "దేవుడి పేరు" అనే సరికొత్త ముసుగు తోడైంది. కడప జిల్లా బద్వేలు పరిసర ప్రాంతాల్లో భక్తి అనే పవిత్ర భావనను కవచంగా మార్చుకుని ప్రభుత్వ భూములను యథేచ్ఛగా ఆక్రమిస్తున్నారనే ఆరోపణలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. మొదట ప్రభుత్వ స్థలంలో చిన్న దేవాలయం నిర్మించి, భక్తుల నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని, ఆపై చుట్టుపక్కల ఉన్న విలువైన సర్కారు భూమిని, చెరువు పోరంబోకు స్థలాలను ప్లాట్లుగా మార్చి విక్రయించే సరికొత్త భూదందా ఇక్కడ వెలుగుచూసింది. గోపవరం మండలం మడకలవారిపల్లె రెవెన్యూ పరిధిలో జరిగిన ఈ వ్యవహారం స్థానికంగా కలకలం రేపుతోంది. దేవుడి పేరిట సాగుతున్న ఈ అక్రమ లావాదేవీలపై రెవెన్యూ అధికారులు కేవలం నామమాత్రపు బోర్డులకే పరిమితం కాకుండా, కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, అప్పుడే పవిత్రమైన భక్తి వ్యాపార వస్తువుగా మారకుండా ప్రభుత్వ ఆస్తులను కాపాడగలమని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

షైనింగ్ స్టార్స్.. రియల్ బ్రాండ్ అంబాసిడర్స్!

» దేశానికే రోల్ మోడల్... ఏపీ ఎడ్యుకేషన్!
» ప్రైవేట్ టు గవర్నమెంట్... వచ్చే ఏడాది లక్ష్యం 2 లక్షలు!
» విద్యార్థే కేంద్రంగా సంస్కరణల అమలు !
» రికమండేషన్ ఉంటేనే... ప్రభుత్వ స్కూళ్లలో సీట్లు!
» షైనింగ్ స్టార్స్‌ను ఘనంగా సత్కరించిన మంత్రి లోకేశ్

వివరాలు2లో..

తాడేపల్లిలోని సీఎస్ఆర్ ఫంక్షన్ హాలులో పదోతరగతి, ఇంటర్మీడియట్ టాప్ ర్యాంకర్ల కోసం నిర్వహించిన 'షైనింగ్ స్టార్స్' సత్కార వేడుక అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రతిభావంతులైన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. టెన్త్ టాపర్లకు నగదు బహుమతులు, ఇంటర్ విజేతలకు ల్యాప్‌టాప్‌లు అందజేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ.. విద్యార్థుల అద్భుత ప్రదర్శన వల్లే ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం వచ్చిందని, ఈ 'షైనింగ్ స్టార్స్' అందరూ ప్రభుత్వానికి నిజమైన బ్రాండ్ అంబాసిడర్లని కొనియాడారు. సింగపూర్, ఫిన్లాండ్ దేశాల విద్యా విధానాలను అందిస్తూ, దేశానికే రోల్ మోడల్‌గా 'ఏపీ ఎడ్యుకేషన్ మోడల్'ను తీర్చిదిద్దుతున్నామని స్పష్టం చేశారు. విద్యార్థే కేంద్రంగా లీప్ మిషన్, క్లిక్కర్ టెక్నాలజీ, ఏఐ ట్యూటర్ వంటి సాంకేతిక సంస్కరణలు తెచ్చామన్నారు. ఒకప్పుడు ప్రభుత్వ స్కూళ్లంటే చిన్నచూపు ఉండేదని, కానీ నేడు తెచ్చిన మార్పుల వల్ల సీట్ల కోసం ప్రజాప్రతినిధుల రికమండేషన్లు అడిగే స్థాయికి విద్యా ప్రమాణాలు పెరిగాయని హర్షం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది నాటికి ప్రైవేట్ నుండి ప్రభుత్వ పాఠశాలలకు మరో రెండు లక్షల మంది విద్యార్థులను తీసుకురావడమే లక్ష్యంగా విద్యాశాఖ పనిచేస్తోందని మంత్రి లోకేశ్ ప్రకటించారు.

మీరు కష్టపడండి... మీ కలల బాధ్యత నాది!

- మార్పు కోసం కదలండి... పాలిటిక్స్ లోకి రండి!
- ఏపీ విద్యారంగంలోకి... 'ఏఐ ట్యూటర్' ఎంట్రీ!
- స్కూల్ స్థాయి నుంచే... శిక్షణకు పక్కా ప్లాన్!
- టాప్ ర్యాంకర్లతో... లోకేశ్ 'షైనింగ్' ముఖాముఖి!

తాడేపల్లి సీఎస్ఆర్ కళ్యాణ మండపంలో పదోతరగతి, ఇంటర్మీడియట్ టాపర్లుగా నిలిచిన 'షైనింగ్ స్టార్స్' విద్యార్థులతో రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన ఆత్మీయ ముఖాముఖి కార్యక్రమం ఎంతో ఆసక్తికరంగా సాగింది. విద్యార్థులు రాసిన డ్రీమ్ వాల్స్, వారి మనోగతాలను పరిశీలించిన మంత్రి, వారి ఉజ్వల భవిష్యత్తుకు పూర్తి భరోసా ఇచ్చారు. "మీరు కష్టపడి చదవండి... మీ కలలను నిజం చేసే బాధ్యత నాది" అంటూ లోకేశ్ విద్యార్థుల్లో ధైర్యాన్ని నింపారు. ఏపీ విద్యావ్యవస్థలో ఎఐ ట్యూటర్ల ప్రవేశం, స్కూల్ స్థాయి నుంచే ఎఐ శిక్షణ, లైబ్రరీల ఆధునీకరణ వంటి విప్లవాత్మక మార్పులను ఈ వేదికగా పంచుకున్నారు. సమాజంలో మార్పు కోసం యువత రాజకీయాల్లోకి..

సేవలకు సెలవు

సర్వీస్ నుంచి సీనియర్ ఐపీఎస్ సునీల్ రిలీవ్

ఆంధ్రప్రదేశ్‌లో చర్చనీయాంశంగా మారిన సీనియర్ ఐపీఎస్ అధికారి పి.వి. సునీల్ కుమార్ నేటితో పదవీ విరమణ పొందనున్నారు. వయోపరిమితి పూర్తికావడంతో ఆయనను సేవల నుంచి రిలీవ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. అయితే పదవీ విరమణతో ఆయనపై కొనసాగుతున్న క్రమశిక్షణా చర్యలు, క్రిమినల్ కేసుల విచారణలకు ఎలాంటి ఆటంకం ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. (వివరాలు 2లో..)

గుడ్ న్యూస్

- ఇకపై ఎంత కావాలంటే అంత
- చమురు విక్రయాలపై ఆంక్షలు ఎత్తివేత
- జూలై ఒకటి నుండి గతంలోలా అమ్మకాలు

పెట్టుబడుల వేటలో నయా ట్రెండ్

» విశాఖ సదస్సుకు బాబు బ్లూప్రింట్!
» భవిష్యత్ అభివృద్ధికి విశాఖే వేదిక
» సరికొత్త ఆలోచనల సన్నాహక సమీక్ష

అమరావతి సచివాలయంలో నవంబర్ నెలలో జరిగే 31వ సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సదస్సు కేవలం పెట్టుబడులు, వ్యాపార ఒప్పందాలకే పరిమితం కాకూడదని ఆయన స్పష్టం చేశారు. పబ్లిక్ పాలసీలు, వినూత్న ఆలోచనలు, భవిష్యత్ అభివృద్ధి వ్యూహాలపై విస్తృత చర్చలు జరగాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కేవలం సంతకాలు చేసే ఒప్పందాల సంఖ్య కంటే, ఎంత మేర అంతర్జాతీయ జ్ఞాన మార్పిడి జరిగిందనే అంశానికే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

• నయా రంగాలపై ప్రత్యేక నజర్

వ్యవసాయం, ఉద్యానవన రంగం, ప్రకృతి వ్యవసాయం, సర్క్యులర్ ఎకానమీ వంటి వినూత్న అంశాలపై ఈ సదస్సులో ప్రత్యేకంగా దృష్టి సారించాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మానసిక ఒత్తిడి లేని పని విధానం, ఆధ్యాత్మికత వంటి ఆధునిక జీవనశైలి అంశాలను కూడా చర్చల్లో భాగం చేయాలన్నారు. ప్రపంచ ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలకు చెందిన నిపుణులను, అంతర్జాతీయ మేధావులను ఈ సదస్సుకు రప్పించాలని కోరారు. అమరావతిలో సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటిస్తూ, ఇది ప్రపంచ స్థాయి విధాన చర్చలకు వేదికగా మారుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

విశ్వనగర నిర్మాణంలో సర్కారు దూకుడు

దేశం మెచ్చే రాజధానిగా అమరావతి • హైదరాబాద్‌ను మించిన సరికొత్త వ్యూహం

అమరావతిని యావత్ దేశం గర్వించే అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరానికి ఒక అడుగు ముందే ఉండేలా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అమరావతి నిర్మాణం జరగాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలో ప్రముఖ నిర్మాణ సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో ఆయన మాట్లాడారు. ఈ చారిత్రాత్మక నగర నిర్మాణంలో భాగస్వాములు కావడం కాంట్రాక్టు సంస్థలకు దక్కిన గొప్ప గౌరవంగా భావించి, పనుల్లో వేగం పెంచాలని పిలుపునిచ్చారు. (వివరాలు 7లో..)

శభాష్ ఏపీ... అభివృద్ధిలో అగ్రస్థానం

» గ్రామీణాభివృద్ధి ప్రగతిలో ఫుల్ మార్క్స్
» కితాబునిచ్చిన శివరాజ్ సింగ్ చౌహాన్

ఒకప్పుడు బంగారం గనులంటే అందరికీ 'కోలార్ గోల్డ్ ఫీల్డ్స్' (కేజీఎఫ్) మాత్రమే గుర్తొచ్చేది. కానీ, ఇప్పుడు ఆ చరిత్రను తిరగరాస్తూ ఆంధ్రప్రదేశ్‌లో 'జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్' (జేజీఎఫ్) ఆవిష్కృతమైంది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించిన ఈ గని, దేశంలోనే అతి పెద్ద ప్రైవేట్ బంగారు గనిగా సరికొత్త రికార్డు సృష్టించింది. సుమారు ₹405 కోట్ల భారీ పెట్టుబడితో జియోమైసూర్ సంస్థ అభివృద్ధి చేసిన ఈ ప్రాజెక్టు, స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏర్పాటైన తొలి ప్రైవేట్ సమీకృత స్వర్ణ క్షేత్రం. ఇక్కడి భూగర్భంలో దాదాపు 12 టన్నుల మేర నిల్వలు ఉన్నట్లు అంచనా. ఒకప్పుడు అశోకుడి రాజధానిగా, 'సువర్ణగిరి'గా పిలవబడిన ఈ చారిత్రక ప్రాంతం, కాలక్రమంలో కరవు సీమగా మారింది. కానీ నేడు జేజీఎఫ్ రాకతో రాయలసీమ రాత మారబోతోంది. 202627 నాటికి 400 కిలోల బంగారం ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్న ఈ పరిశ్రమ, స్థానిక యువతకు వందలాది ఉపాధి అవకాశాలు కల్పిస్తూ కరవు సీమను మళ్లీ 'రతనాల సీమ'గా మార్చేందుకు సరికొత్త రికార్డుల బాట పట్టింది.

ధర్మ రక్షణ ముసుగులో అపచారం

నిర్లక్ష్యానికి పరాకాష్ట: భూమన విమర్శలు

తిరుపతి అలిపిరి సమీపంలోని టీటీడీ స్థలాల్లో శ్రీ వేంకటేశ్వరస్వామి చిత్రపటాలు అత్యంత నిర్లక్ష్యంగా పడివుండటం తీవ్ర దుమారం రేపుతోంది. పవిత్రంగా ఉండాల్సిన ఆధ్యాత్మిక ప్రాంతాలు చెత్తకుప్పలను తలపిస్తున్నాయని టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టీటీడీ విజిలెన్స్ వ్యవస్థ పూర్తిగా నిద్రపోతోందని, ఇంతటి ఘోర అపచారం జరుగుతున్నా ఈవో, పాలకమండలి చైర్మన్ బీఆర్ నాయుడు స్పందించకపోవడం సిగ్గుచేటని భూమన విమర్శించారు. (వివరాలు 7లో..)

డ్వాక్రా మహిళలకు తీరని అన్యాయం

హామీల అమలులో మోసం: బుగ్గన ఆగ్రహం

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు అబద్ధాలు చెబుతోందని మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ విమర్శించారు. డ్వాక్రా మహిళల వడ్డీ రాయితీపై వైయస్ జగన్ లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందన్నారు. గత వైయస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మహిళల సాధికారత కోసం వడ్డీ రాయితీ కింద వేల కోట్ల రూపాయలు నేరుగా వారి ఖాతాల్లో జమ చేశామని బుగ్గన స్పష్టం చేశారు. (వివరాలు 7లో..)

లాకర్లు ఖాళీ!

బంగారం వెలవెల • అమ్మకాల జాతర

ఖాకీల దారుణం... కీలక మలుపు

లాకప్ డెత్ కేసులో విచారణ వాయిదా

సీఐ నాగరాజు కస్టడీపై కోర్టు నిర్ణయం

హెడ్ కానిస్టేబుళ్ల లొంగుబాటు

విజయవాడలో సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ లాకప్ డెత్ కేసులో ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు జంగం నాని, అశోక్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ లొంగుబాటు వెంటనే రంగంలోకి దిగిన ప్రత్యేక విచారణ బృందం, సిట్ వారిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు తరలించి విచారించడం ప్రారంభించింది. సాయికృష్ణను అక్రమంగా నిర్బంధించడంలో, చిత్రహింసలు పెట్టడంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజుకు వీరు సహకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. కమిషనర్ వీరిద్దరినీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సిట్ ప్రశ్నల వర్షం

ఐజీ రవిప్రకాష్ నేతృత్వంలోని సిట్ బృందం నిందితులను తీవ్రంగా ప్రశ్నిస్తోంది. సాయికృష్ణను ఎన్ని రోజులు లాకప్‌లో ఉంచారు? చిత్రహింసల్లో ఎంతమంది పాల్గొన్నారు? అతను ఎప్పుడు, ఏ పరిస్థితుల్లో చనిపోయాడు? వంటి అనేక ప్రశ్నలపై సమాధానాలు రాబడుతున్నారు. అనారోగ్యానికి గురైనప్పుడు కనీసం వైద్యసాయం అందించారా లేదా? శవాన్ని ఎలా మాయం చేయాలని చూశారు? అనే కోణంలో విచారణ సాగుతోంది. (వివరాలు 7లో..)

ప్రియుడికి కోటి నజరానా

పెళ్లి షాపింగ్ పేరిట కోటి కొల్లగొట్టిన సియా

కిలాడీ ప్లాన్ లీక్

» పాస్‌పోర్ట్ దహనం వెనుక రహస్యం!
» నిందితులకు కస్టడీ పొడిగింపు
» పక్కా సాక్ష్యాలతో పోలీసుల వాదన

షైనింగ్ స్టార్స్...

రియల్ బ్రాండ్ అంబాసిడర్స్

దేశానికే రోల్ మోడల్.. ఏపీ ఎడ్యుకేషన్!

ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో తాడేపల్లిలోని సీఎస్ఆర్ ఫంక్షన్ హాలులో పదోతరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో అద్భుత ప్రదర్శన కనబరిచిన విద్యార్థుల కోసం 'షైనింగ్ స్టార్స్' సత్కార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ విజేతలను సత్కరించారు. పదోతరగతిలో రాణించిన 55 మంది విద్యార్థులకు రూ.30 వేల నగదు బహుమతి, ప్రశంసాపత్రం, మెడల్ అందించారు. ఇంటర్మీడియట్ లో ప్రతిభ చూపిన 61 మంది విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు, మెడల్స్ బహూకరించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపింది.

నాణ్యమైన విద్యే ఏపీ మోడల్

ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని ఉత్తమ ఉపాధ్యాయులను సింగపూర్, ఫిన్లాండ్ వంటి దేశాలకు పంపి అక్కడి అత్యాధునిక విద్యా విధానాలను మన పాఠశాలల్లో అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. భవిష్యత్తులో దేశం మొత్తం 'ఏపీ మోడల్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్' గురించి మాట్లాడుకునేలా విద్యా వ్యవస్థను తీర్చిదిద్దడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది నాటికి ప్రైవేట్ విద్యాసంస్థల నుండి సుమారు రెండు లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ విజయ ప్రయాణంలో ప్రతిభావంతులైన విద్యార్థులే ప్రభుత్వానికి నిజమైన బ్రాండ్ అంబాసిడర్లని కొనియాడారు.

చరిత్ర తిరగరాసిన విద్యార్థుల కష్టం

విద్యార్థుల కష్టాన్ని అభినందిస్తూ, అబ్దుల్ కలాం చెప్పిన "కలలు మిమ్మల్ని నిద్రపోనివ్వవు" అనే మాటను లోకేశ్ గుర్తుచేశారు. రాత్రింబవళ్లు శ్రమించి విద్యార్థులు సాధించిన విజయాలు విద్యాశాఖకే గర్వకారణంగా నిలిచాయన్నారు. గతంలో ప్రభుత్వ పాఠశాలల పట్ల ఉన్న చిన్న చూపును ఈ ఫలితాలు పూర్తిగా చెరిపివేశాయని హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఉత్తమ పెర్ఫార్మెన్స్ వల్ల మంత్రిగా తన గౌరవంతో పాటు రాష్ట్రంలోని రెండు లక్షల మంది ఉపాధ్యాయుల గౌరవం పెరిగిందన్నారు. జూలై నెలలో నిర్వహించబోయే 'మెగా పిటిఎం'... తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశం ద్వారా పాఠశాలల పూర్వవైభవాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని నమ్మకం వ్యక్తం చేశారు.

విద్యాశాఖలో సాఫ్ట్‌వేర్ మార్పులు

విద్యాశాఖను వ్యవసాయంతో పోల్చిన మంత్రి, ఫలితాలు ఆలస్యంగా వచ్చినా అవి సమాజానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. పాఠశాలల్లో కేవలం భవనాలు, ఫ్యాన్లు, టాయిలెట్లు వంటి హార్డ్‌వేర్ వసతులు మాత్రమే కాకుండా, నాణ్యమైన విద్య అనే 'సాఫ్ట్‌వేర్' కూడా అంతే ముఖ్యమని బోర్డు తిప్పారు. ఇందుకోసం 'లీప్ మిషన్' ప్రారంభించి లీప్ యాప్ అందుబాటులోకి తెచ్చామన్నారు.

విద్యావ్యవస్థలో రాజకీయ రంగులు తీసేస్తూ, పాఠ్యపుస్తకాలపై ముఖ్యమంత్రి, మంత్రుల ఫోటోలు, సందేశాలను పూర్తిగా తొలగించినట్లు చెప్పారు. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో సీట్ల కోసం ప్రజాప్రతినిధుల రికమెండేషన్లు అడిగే స్థాయికి విద్యా ప్రమాణాలు పెరిగాయని మంగళగిరిలో జరిగిన ఒక సంఘటనను ఉదహరించారు.

డిజిటల్ విప్లవం సాంకేతిక సంస్కరణలు

విద్యార్థులను కేంద్రబిందువుగా చేసుకుని అనేక సంస్కరణలు అమలు చేస్తున్నట్లు లోకేశ్ వివరించారు. పది వేల పాఠశాలల్లో 'వన్ క్లాస్ వన్ టీచర్' విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. విద్యార్థుల ఆల్‌రౌండ్ డెవలప్‌మెంట్ కోసం 'నో బ్యాగ్ డే' ప్రవేశ పెట్టామని, సాంప్రదాయ బోధనను మార్చేందుకు 'క్లిక్కర్ టెక్నాలజీ' తెచ్చామని, త్వరలోనే 'ఏఐ ట్యూటర్'ను కూడా పరిచయం చేయబోతున్నామని ప్రకటించారు. ఈ సంస్కరణల వల్లనే ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణత శాతం 72.8 శాతం నుండి 78.39 శాతానికి పెరిగిందని గణాంకాలతో సహా వెల్లడించారు. నిరుద్యోగ యువత కోసం మెగా డిఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేశామని గుర్తుచేశారు.

పోషకాహారం స్మార్ట్ కిచెన్స్

విద్యార్థుల ఆరోగ్యం కోసం 'డొక్కా సీతమ్మ' పేరిట నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నట్లు లోకేశ్ తెలిపారు. భోజన నాణ్యతను స్వయంగా ముఖ్యమంత్రి పరిశీలించి మార్పులు చేయించారని, ప్రస్తుతం నాణ్యమైన బియ్యంతో పాటు మిల్లెట్ చిక్కీలను ఇస్తున్నామని చెప్పారు. కడప కలెక్టర్ ఆధ్వర్యంలో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించిన 'స్మార్ట్ కిచెన్' విధానాన్ని కేంద్ర ప్రభుత్వం సైతం అభినందించిందని, త్వరలోనే దీనిని రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని స్పష్టం చేశారు. కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ 'తల్లికి వందనం' పథకం వర్తింపజేస్తూ ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

విలువలతో కూడిన విద్యే ముఖ్యం

కేవలం చదువు మాత్రమే కాకుండా సమాజంలో నైతిక విలువలు నేర్పడం చాలా ముఖ్యమని మంత్రి అభిప్రాయపడ్డారు. అందుకోసమే ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావును విలువ ఆధారిత విద్యకు సలహాదారుగా నియమించినట్లు చెప్పారు. "అమ్మకు చెప్పలేని ఏ పనిని చేయకూడదు" అనే సూత్రాన్ని విద్యార్థులు జీవితంలో పాటించాలని పిలుపునిచ్చారు. మహిళలను గౌరవించడం చిన్నతనం నుండే అలవాటు కావాలని, సమాజంలో మహిళలను అవమానించేలా మాట్లాడే ధోరణి మారాలని హితవు పలికారు. యువత కేవలం ఉద్యోగాలకే పరిమితం కాకుండా రాజకీయాల్లోకి వచ్చి సమాజ మార్పునకు భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు.

వైఫల్యాలను ఎదుర్కొనే ఆత్మవిశ్వాసం

ఓటమిని చూసి విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవద్దని, పరీక్షల్లో ఫెయిల్ అంటే చదువులో మొదటి ప్రయత్నం... అని అర్థం చేసుకోవాలని లోకేశ్ ధైర్యం చెప్పారు. తన సొంత జీవితాన్నే పెద్ద ఉదాహరణగా చూపిస్తూ, 2019 ఎన్నికల్లో మంగళగిరిలో ఓడిపోయినప్పుడు ఎంతో బాధపడ్డానని, కానీ ఆ ఓటమినే కసిగా మార్చుకుని ఐదేళ్లు ప్రజల్లో పనిచేసి 2024లో 91 వేల భారీ మెజారిటీతో గెలిచానని వివరించారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థిపై ఏడాదికి లక్ష రూపాయల వరకు ఖర్చు చేస్తోందని, కాబట్టి విద్యార్థులు బాధ్యతగా చదివి భవిష్యత్తులో తాము చదువుకున్న పాఠశాలలకు తమ వంతు సాయం అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు తమీమ్ అన్సారీయా, రంజిత్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మీరు కష్టపడండి...
మీ కలల బాధ్యత నాది!

- మార్పు కోసం కదలండి... పాలిటిక్స్ లోకి రండి!
- ఏపీ విద్యారంగంలోకి... 'ఏఐ ట్యూటర్' ఎంట్రీ!
- స్కూల్ స్థాయి నుంచే... శిక్షణకు పక్కా ప్లాన్!
- టాప్ ర్యాంకర్లతో లోకేశ్ 'షైనింగ్' ముఖాముఖి!

తాడేపల్లి సీఎస్ఆర్ కళ్యాణ మండపంలో పదోతరగతి, ఇంటర్మీడియట్ టాపర్లుగా నిలిచిన 'షైనింగ్ స్టార్స్' విద్యార్థులతో రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన ఆత్మీయ ముఖాముఖి కార్యక్రమం ఎంతో ఆసక్తికరంగా సాగింది. విద్యార్థులు రాసిన డ్రీమ్ వాల్స్, వారి మనోగతాలను పరిశీలించిన మంత్రి, వారి ఉజ్వల భవిష్యత్తుకు పూర్తి భరోసా ఇచ్చారు. "మీరు కష్టపడి చదవండి... మీ కలలను నిజం చేసే బాధ్యత నాది" అంటూ లోకేశ్ విద్యార్థుల్లో ధైర్యాన్ని నింపారు. ఏపీ విద్యావ్యవస్థలో ఎఐ ట్యూటర్ల ప్రవేశం, స్కూల్ స్థాయి నుంచే ఎఐ శిక్షణ, లైబ్రరీల ఆధునీకరణ వంటి విప్లవాత్మక మార్పులను ఈ వేదికగా పంచుకున్నారు. సమాజంలో మార్పు కోసం యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిస్తూ, విద్యార్థుల సమస్యలను తక్షణమే పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.

రాజకీయాల్లోకి యువత రావాలి

సమాజంలో నిజమైన మార్పు రావాలంటే యువత చురుగ్గా రాజకీయాల్లోకి రావాలని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు. తాను క్రియాశీల రాజకీయాల్లో ఉండటం వల్లే దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్ విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకురాగలిగానని స్పష్టం చేశారు. విద్యార్థులు అందించిన సలహాలు ఎంతో అద్భుతంగా ఉన్నాయన్నారు. కాకినాడకు చెందిన క్రాంతి అనే విద్యార్థి అడిగిన దానికి సమాధానంగా, గ్రంథాలయాల ద్వారా సృజనాత్మకత పెరుగుతుందని, అందుకే మండల, జిల్లా స్థాయిల్లో లైబ్రరీలను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. అమరావతిలో ఏడాది కాలంలో అంతర్జాతీయ స్థాయి గ్రంథాలయాన్ని నిర్మిస్తామన్నారు. కంప్యూటర్ ల్యాబ్‌లు, ఎన్‌సీసీ కావాలన్న అన్నపూర్ణేశ్వరి ప్రశ్నకు స్పందిస్తూ, త్వరలోనే ఎఐ ట్యూటర్‌ను తీసుకొస్తున్నామని, కేంద్ర ప్రభుత్వం ఏపీకి ప్రత్యేకంగా ఎన్ సీసీ స్టేట్ డైరెక్టరేట్ ను మంజూరు చేసిందని వెల్లడించారు.

కార్డియాలజిస్ట్ కావాలనే కల

కదిరి ప్రభుత్వ జూనియర్ కాలేజీకి చెందిన షేక్ చాందిని

ఇంటర్మీడియట్ లో 991 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచింది. తన విద్యాభ్యాసానికి లెక్చరర్లు, తల్లిదండ్రులు ఆర్థికంగా తోడ్పడ్డారని, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం, సర్వేపల్లి రాధాకృష్ణన్ కిట్స్ ఎంతగానో ఉపయోగపడ్డాయని చెప్పింది. తన తండ్రి గుండె జబ్బుతో బాధపడుతున్నారని, ఆయన కోసమే తాను కార్డియాలజిస్ట్ కావాలనుకుంటున్నట్లు తెలిపి నీట్ పరీక్షకు కోచింగ్ ఇప్పించాలని కోరగా, లోకేశ్ సానుకూలంగా స్పందించి పూర్తి సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే టెక్కలికి చెందిన అనన్యశ్రీ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతున్నాయని, తాను భవిష్యత్తులో ఐఎఎస్ సాధించి స్వర్ణాంధ్ర నిర్మాణంలో భాగస్వామ్యం అవుతానని నమ్మకం వ్యక్తం చేసింది.

పాఠశాలల్లో ఏఐ శిక్షణ

పోటీ పరీక్షలకు పాఠశాల స్థాయి నుంచే ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని నంద్యాలకు చెందిన షేక్ అనీషా కోరింది. రాబోయే ఐదేళ్లలో 10, 11, 12 తరగతుల విద్యార్థులు చదువుతో పాటు సమాంతరంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా ప్రణాళికలు రూపొందిస్తామని లోకేశ్ వివరించారు. నెల్లూరుకు చెందిన షేక్ షకీల మాట్లాడుతూ, మంత్రి నారాయణ కృషి వల్ల తమ పాఠశాల బాగుపడిందని, లోకేశ్ విద్యామంత్రి అయ్యాక ప్రభుత్వ స్కూళ్ల బలం ప్రపంచానికి తెలిసిందని ప్రశంసించింది. దీనిపై మంత్రి స్పందిస్తూ, మొదటి విడతలో ప్రతి నియోజకవర్గంలో ఒక మోడల్ స్కూల్‌ను తీర్చిదిద్దుతామన్నారు. ప్రకాశం జిల్లాకు చెందిన పవన్ సాయి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై అడిగిన ప్రశ్నకు సమాధానంగా, రాబోయే సాంకేతిక విప్లవాన్ని తట్టుకునేలా పాఠశాల స్థాయి నుంచే ఎఐ ల్యాబ్‌లు ఏర్పాటు చేసి ప్రాథమికాంశాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తామని స్పష్టం చేశారు.

మధ్యలోనే చదువులు ఆపొద్దు

కుటుంబ ఆర్థిక పరిస్థితుల వల్ల అనంతపురం జిల్లాకు చెందిన మనీష చదువుకోలేకపోతున్నానని కన్నీరు పెట్టుకోగా, లోకేశ్ ధైర్యం చెబుతూ నీ చదువు బాధ్యత నాదేనని హామీ ఇచ్చారు. అంగన్‌వాడీ నుంచి ఉన్నత విద్య వరకు ఏ ఒక్క విద్యార్థి కూడా చదువు మధ్యలో ఆపేయకూడదనే ఉద్దేశంతో ప్రతి ఒక్కరిని ట్రాక్ చేసి అండగా నిలిచే వ్యవస్థను తెస్తున్నట్లు చెప్పారు. అలాగే చిన్న వయసులోనే పెళ్లయి, ఆరేళ్ల విరామం తర్వాత ఇంటర్ ఒకేషనల్ లో 990 మార్కులతో టాపర్‌గా నిలిచిన ప్రకాశం జిల్లా భాగ్యం కథ అందరినీ కదిలించింది. చదువు జీవితాన్ని మారుస్తుందని నమ్మి డిగ్రీ చదవాలనుకుంటున్నట్లు తెలిపిన భాగ్యానికి అవసరమైన సాయం అందిస్తామన్నారు.

ఆలోచనా శక్తే నా బలం

విద్యార్థి జీవితంలో మరువలేని జ్ఞాపకం గురించి శంఖవరం విద్యార్థిని స్వాతి అడగ్గా, తాను ఎప్పుడూ చదువును బట్టీ పట్టలేదని, అప్లికేషన్, ఎగ్జిక్యూషన్, క్రిటికల్ థింకింగ్ మాత్రమే తన బలమని లోకేశ్ సమాధానమిచ్చారు. ఐఐటి కోచింగ్ ఇవ్వాలని, తమ గ్రామంలో దశాబ్దాలుగా పాడైపోయిన రోడ్డును బాగు చేయాలని స్వాతి విన్నవించగా, మూడు నాలుగు నెలల్లో రోడ్డు వేయిస్తానని మంత్రి చెప్పారు. విశాఖకు చెందిన ఫిజియోథెరపీ విద్యార్థి శ్రీహర్ష తన తండ్రి పక్షవాతంతో చనిపోయాడని, అందుకే హెల్త్ అవేర్‌నెస్ కోసం ఈ కోర్సు ఎంచుకున్నట్లు చెప్పి పాఠశాలల్లో ఫిజికల్ ఎడ్యుకేషన్, మెంటల్ హెల్త్ తరగతులు నిర్వహించాలని కోరారు. స్పందించిన లోకేశ్, ప్రభుత్వం ప్రతి విద్యార్థిపై లక్ష రూపాయలు ఖర్చు చేస్తోందని, విద్యార్థులు బాగా చదివి భవిష్యత్తులో తాము చదువుకున్న స్కూళ్లకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో విద్యాశాఖ అధికారులు తమీమ్ అన్సారీయా, రంజిత్ బాషా పాల్గొన్నారు.

లాకర్లు ఖాళీ!

. బంగారం వెలవెల . అమ్మకాల జాతర

మార్కెట్లో బంగారం ధరలు ఆకాశాన్ని తాకినప్పుడు మురిసిపోయిన జనాలు, ఇప్పుడు ధరలు కాస్త తగ్గుముఖం పట్టేసరికి కంగారు పడుతున్నారు. భవిష్యత్తులో ధరలు మరింత పడిపోతాయేమోననే ఆందోళనతో తమ వద్ద ఉన్న పాత బంగారాన్ని తెగనమ్ముతున్నారు. నిన్నటివరకు లాకర్లలో భద్రంగా దాచుకున్న నగలన్నీ ఇప్పుడు మార్కెట్లోకి క్యూ కడుతున్నాయి. లాభాలు చేజారిపోకముందే సొమ్ము చేసుకోవాలనే ఆరాటం అందరిలోనూ కనిపిస్తోంది.

నిపుణుల హెచ్చరిక: జాగ్రత్త సుమా!

ఇండియా బులియన్, జ్యువెలర్స్ అసోసియేషన్ ప్రకారం, గడిచిన త్రైమాసికంలో ఏకంగా 50 టన్నుల బంగారాన్ని ప్రజలు విక్రయించారు. అంతర్జాతీయంగా అమెరికా వడ్డీ రేట్ల పెంపు అంచనాలు, క్రూడాయిల్ ధరల ప్రభావం పసిడిపై ఒత్తిడి పెంచుతోంది. అయితే, ధరలు తగ్గుతాయనే భయంతో ఉన్నపళంగా ఆభరణాలన్నీ అమ్మేయడం అంత మంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తొందరపాటు నిర్ణయాలు దీర్ఘకాలిక పెట్టుబడి నష్టాలకు దారితీసే ప్రమాదం ఉంది.

దేశానికి మేలు: ఆసక్తికర పరిణామం

ఈ అమ్మకాల వెనుక ఒక ఆసక్తికరమైన కోణం కూడా ఉంది. ప్రజలు తమ పాత బంగారాన్ని మార్కెట్లోకి తీసుకురావడం వల్ల దేశీయంగా రీసైక్లింగ్ పరిశ్రమకు ఊపు వస్తుంది. దీనివల్ల విదేశాల నుంచి మనం చేసుకునే బంగారం దిగుమతులు గణనీయంగా తగ్గుతాయి. ఫలితంగా దేశ ఆర్థిక వ్యవస్థకు, ప్రభుత్వ ఖజానాకు భారీగా మేలు జరుగుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. భయం తెచ్చిన ఈ మార్పు దేశానికి లాభదాయకంగా మారడం విశేషం.

శభాష్ ఏపీ... అభివృద్ధిలో అగ్రస్థానం

- గ్రామీణాభివృద్ధి ప్రగతిలో ఫుల్ మార్క్స్
- కితాబునిచ్చిన శివరాజ్ సింగ్ చౌహాన్

గ్రామీణాభివృద్ధి రంగానికి సంబంధించిన వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అద్భుతమైన పనితీరు కనబరుస్తూ దేశంలోనే ముందంజలో నిలిచిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రత్యేకంగా ప్రశంసించారు. ఢిల్లీలో నిర్వహించిన రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి మంత్రులు, ఉన్నతాధికారుల ఉన్నతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వీబీజీరామ్‌జీ రాష్ట్ర నోటిఫికేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన రాష్ట్రాల్లో ఏపీ అగ్రస్థానంలో ఉందని కొనియాడారు. జూలై 2వ తేదీన తిరుపతి జిల్లా వేదికగా ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. అలాగే ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద గ్రామీణ రహదారుల నిర్మాణ నాణ్యతలో దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రాల జాబితాలో ఏపీ అగ్రభాగాన నిలిచిందని స్పష్టం చేశారు. రాష్ట్రాల క్రియాశీలక సమన్వయంతోనే వికసిత్ భారత్ సాధన సాధ్యమవుతుందన్న కేంద్ర మంత్రి.. పీఎంజీఎస్‌వై కింద ఇప్పటికే ఆమోదం పొందిన మిగిలిన రహదారి పనులకు సంబంధించిన కాంట్రాక్టు ప్రక్రియలను కూడా వేగంగా పూర్తి చేసి పనులను పట్టాలెక్కించాలని రాష్ట్ర అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

. గుడ్ న్యూస్

ఇకపై ఎంత కావాలంటే అంత

చమురు విక్రయాలపై ఆంక్షలు ఎత్తివేత

జూలై ఒకటి నుండి గతంలోలా అమ్మకాలు

దేశంలో పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై విధించిన ఆంక్షలను పూర్తిగా ఎత్తివేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కొత్త నిర్ణయం జూలై ఒకటవ తేదీ నుండి దేశవ్యాప్తంగా అమల్లోకి రానుంది. ముఖ్యంగా ఒక వ్యక్తికి రోజుకు గరిష్ఠంగా 200 లీటర్ల డీజిల్ మాత్రమే విక్రయించాలనే నిబంధనను ఇప్పుడు పూర్తిగా రద్దు చేశారు. దీనివల్ల సాధారణ వాహనదారులతో పాటు చిన్న వ్యాపారస్తులకు పెద్ద ఊరట లభించనుంది. గతంలో జూన్ 11న కేంద్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక ఉత్తర్వును జారీ చేసింది. ఆ ఉత్తర్వుల ప్రకారం పారిశ్రామిక, వాణిజ్య వినియోగదారులు సాధారణ రిటైల్ పెట్రోల్ బంకుల నుండి ఇంధనాన్ని కొనుగోలు చేయడాన్ని నిషేధించారు. వారు తమకు కావలసిన పెట్రోల్, డీజిల్‌ను కేవలం నిర్దేశిత సరఫరా మార్గాల ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలని ఆదేశించారు. ఇప్పుడు ఆ పాత నిబంధనలన్నింటినీ ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టింది. బల్క్ డీజిల్ వినియోగదారులు ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థల రిటైల్ అవుట్‌లెట్లకు భారీగా తరలిరావడంతో మార్కెట్‌లో తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. కొన్ని రిటైల్ బంకుల్లో ఇంధన డిమాండ్ అసాధారణంగా పెరిగిపోయింది. ఈ పరిస్థితిని అదుపు చేయడానికి, మార్కెట్‌లో సమతుల్యతను కాపాడటానికి జూన్ నెలలో ప్రభుత్వం ఆంక్షలు విధించాల్సి వచ్చింది. ప్రస్తుతం ఇంధన సరఫరా సాధారణ స్థితికి చేరుకోవడంతో ఆంక్షలు తొలగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది.

. సేవలకు సెలవు

సర్వీస్ నుంచి సీనియర్ ఐపీఎస్ సునీల్ రిలీవ్

ఆంధ్రప్రదేశ్‌లో చర్చనీయాంశంగా మారిన సీనియర్ ఐపీఎస్ అధికారి పి.వి. సునీల్ కుమార్ నేటితో పదవీ విరమణ పొందనున్నారు. వయోపరిమితి పూర్తికావడంతో ఆయనను సేవల నుంచి రిలీవ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. అయితే పదవీ విరమణతో ఆయనపై కొనసాగుతున్న క్రమశిక్షణా చర్యలు, క్రిమినల్ కేసుల విచారణలకు ఎలాంటి ఆటంకం ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్ విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం, పి.వి. సునీల్ కుమార్‌పై ఉన్న అన్ని విచారణలు అఖిల భారత సర్వీసెస్ నిబంధనల ప్రకారమే కొనసాగుతాయి. ఉద్యోగ విరమణ జరిగినా, విచారణలు పూర్తయ్యే వరకు చట్టపరమైన ప్రక్రియ యథావిధిగా కొనసాగుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆరోపణలకు సంబంధించిన అంశాలపై తుది నిర్ణయం వచ్చే వరకు నిబంధనల ప్రకారమే వ్యవహరిస్తామని ప్రభుత్వం తెలిపింది. పదవీ విరమణ అనంతరం అందాల్సిన పింఛను, ఇతర రిటైర్మెంట్ ప్రయోజనాలు కూడా ప్రస్తుత విచారణల ఫలితాల ఆధారంగా నిర్ణయించబడతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. అఖిల భారత సర్వీసెస్ నిబంధనలు, కేంద్ర ప్రభుత్వం జారీ చేసే మార్గదర్శకాల ప్రకారమే ఆర్థిక ప్రయోజనాల విడుదలపై తుది నిర్ణయం తీసుకుంటామని ఉత్తర్వుల్లో వెల్లడించింది. ఈ వ్యవహారంలో అవసరమైన తదుపరి చర్యలు చేపట్టాలని రాష్ట్ర డీజీపీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గతంలో కీలక హోదాల్లో పనిచేసిన సమయంలో తీసుకున్న కొన్ని నిర్ణయాలపై ఇప్పటికే విచారణలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో పూర్తి స్థాయి పదవీ విరమణ ప్రయోజనాలపై స్పష్టత రావాలంటే విచారణలు పూర్తయ్యే వరకు వేచి చూడాల్సి ఉంటుంది. ఈ పరిణామం రాష్ట్ర పోలీసు వర్గాల్లో విస్తృత చర్చకు దారితీసింది.

128 ఏళ్ల తర్వాత

క్రికెట్‌కి చోటు

- **ఒలింపిక్స్‌లో క్రికెట్ పండుగ**
- **నం. 1 పొజిషన్‌తో భారత్ ఎంట్రీ**
- **తాజాగా మహిళల జట్టుకు చోటు**

భారత మహిళల క్రికెట్ జట్టు సరికొత్త రికార్డు సృష్టించింది. 2028 లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ), అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించాయి. దాదాపు 128 సంవత్సరాల తర్వాత క్రికెట్ మళ్లీ ఒలింపిక్స్‌లో భాగం కానుంది. ఈ మెగా టోర్నమెంట్‌లో పురుషుల, మహిళల విభాగాలలో ఆరేసి జట్లు పోటీపడతాయి. 2026 మహిళల టీ20 ప్రపంచకప్‌లో అత్యుత్తమ ప్రదర్శన ఆధారంగా ఆసియా ఖండం నుండి భారత్ ఈ అరుదైన అవకాశాన్ని దక్కించుకుంది.

రేసులో పురుషుల జట్టు

మహిళల జట్టుతో పాటు భారత పురుషుల క్రికెట్ జట్టు కూడా ఒలింపిక్స్ అర్హతకు చాలా దగ్గరగా ఉంది. 2026 డిసెంబర్ 31 నాటికి ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచే జట్లకు ఈ అవకాశం దక్కుతుంది. ప్రస్తుతం ప్రపంచ ఛాంపియన్‌గా ఉన్న భారత పురుషుల జట్టు ర్యాంకింగ్స్‌లో మొదటి స్థానంలో కొనసాగుతోంది. దీనివల్ల భారత్‌కు నేరుగా అర్హత లభించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఆసియా ఖండం నుండి తదుపరి స్థానంలో ఉన్న పాకిస్తాన్ ప్రస్తుతం ఆరో ర్యాంకులో నిలిచింది. ఆఫ్రికా, యూరప్, ఓషియానియా ప్రాంతాల నుండి కూడా అత్యుత్తమ జట్లు ఎంపిక వుతాయి.

ఆతిథ్య దేశం హోదా

లాస్ ఏంజెల్స్ ఒలింపిక్స్ ఆతిథ్య దేశంగా అమెరికాకు నేరుగా పోటీ పడే అవకాశం లభిస్తుంది. కాకపోతే, అమెరికా పురుషుల, మహిళల జట్లు జూన్ 30, 2026 నుండి డిసెంబర్ 31, 2026 మధ్య కాలంలో ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో మొదటి 15 స్థానాల్లో ఏదో ఒక సమయంలో నిలవాల్సి ఉంటుంది. ఈ నిబంధనను పూర్తి చేస్తే అమెరికా జట్లు నేరుగా టోర్నీలో ఆడతాయి. మహిళల విభాగంలో భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, గ్రేట్ బ్రిటన్, దక్షిణాఫ్రికా జట్లు ఇప్పటికే తమ స్థానాలను ఖాయం చేసుకున్నాయి.

చివరి స్థానం కోసం పోటీ

ఐదో స్థానం వరకు జట్లు ఖరారైన తర్వాత, ఆరో స్థానం కోసం ప్రత్యేకంగా 2027లో ఐసీసీ ఒలింపిక్స్ క్వాలిఫైయర్ టోర్నమెంట్ నిర్వహిస్తారు. ఈ టోర్నీలో ఎనిమిది జట్లు తలపడతాయి. వెస్టిండీస్ జట్టుకు ఒలింపిక్స్‌లో నేరుగా ఆడే అవకాశం లేదు. ఎందుకంటే అది వేర్వేరు కరేబియన్ దేశాల కలయికగా ఉంది. దానికి ఒలింపిక్ కమిటీ గుర్తింపు లేదు. అయితే 2026 డిసెంబర్ నాటికి వెస్టిండీస్ టాప్ 8లో ఉంటే, కరేబియన్ దేశాల మధ్య ప్రత్యేక పోటీలు పెట్టి ఒక దేశాన్ని క్వాలిఫైయర్స్‌కు పంపుతారు. ఈ మ్యాచ్‌లన్నీ లాస్ ఏంజెల్స్ కౌంటీలోని పోమోనాలో ప్రత్యేకంగా నిర్మించే స్టేడియంలో జరుగుతాయి.

ఖానాపూర్ ఎమ్మెల్యే తిరుగుబాటు

- **సొంత పార్టీపైనే వెడ్మ బొజ్జు ఆరోపణలు**

ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల్లో ఖానాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. జిల్లా కేంద్రంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సొంత ప్రభుత్వంపైనే బహిరంగంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ విపక్ష బీజేపీ ఎమ్మెల్యేలకే మంత్రులు, అధికారులు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి అయి ఉండి కూడా సొంత అధికారుల తీరుపై ఆయన ఈ స్థాయిలో అసంతృప్తి వెళ్లగక్కడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

బీజేపీ నేతలకే అధిక ప్రాధాన్యత

కాంగ్రెస్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తన ప్రసంగంలో ముఖ్యంగా ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్, నిర్మల్ బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డిల పేర్లను ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వారిద్దరికీ అధిక ప్రాధాన్యత ఇస్తోందని, దీనివల్ల క్షేత్రస్థాయిలో పార్టీ కోసం రాత్రింబవళ్లు కష్టపడిన అసలైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పార్టీకి దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీకి గట్టి పోటీగా నిలిచే ప్రత్యర్థి పార్టీల నాయకులను ఇలాగే దగ్గరకు తీస్తూ పోతే రాబోయే రోజుల్లో పార్టీకి తీరని నష్టం జరుగుతుందని ఆయన హైకమాండ్‌ను హెచ్చరించారు.

ప్రోటోకాల్ ఉల్లంఘన

నియోజకవర్గంలో అధికారుల ప్రోటోకాల్, వ్యవహారశైలిపై కూడా ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తానే స్వయంగా అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ తన సొంత నియోజకవర్గంలో ఏం జరుగుతుందో, ఏ పనులు మంజూరవుతున్నాయో కనీసం తనకు సమాచారం తెలియడం లేదన్నారు. ఇంతకంటే దారుణమైన పరిస్థితి మరొకటి ఉండదని మండిపడ్డారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు నేరుగా హైదరాబాద్ వెళ్లి మంత్రుల వద్ద నుండి సిఫార్సు లేఖలు తెచ్చుకుంటున్నారని, ఇక్కడి అధికారులు స్థానిక ఎమ్మెల్యే అయిన తనకు చెప్పకుండా వారి పనులను చకచకా చేసి పెడుతున్నారని ఆరోపించారు. మంత్రుల తీరుపై ఒక అధికార పార్టీ ఎమ్మెల్యే ఈ స్థాయిలో విమర్శలు గుప్పించడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ఖమ్మం సభ రద్దు

- **శిల్పకళా వేదిక నుంచే రైతుభరోసా**
- **వాన దెబ్బకు మారిన సీఎం సభ వేదిక**

ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో మంగళవారం జరగాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'రైతు ఆశీర్వాద సభ' రద్దయింది. మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాథపురంలో దాదాపు లక్ష మందితో ఈ భారీ సభను నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సభా ప్రాంగణంలోకి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరింది. అక్కడ సభ నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో జిల్లా అధికారులు ఈ విషయాన్ని ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదించారు. దీంతో ప్రభుత్వం ఖమ్మం సభను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది.

హైదరాబాద్‌కు మారిన వేదిక

మధిరలో సభ రద్దు కావడంతో ఈ కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికకు మార్చారు. ఇక్కడి నుంచే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'రైతుభరోసా' నిధులను అధికారికంగా విడుదల చేయనున్నారు. శిల్పకళా వేదికలో జరిగే ఈ రైతుభరోసా పంపిణీ సదస్సుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను తక్షణమే పూర్తి చేయాలని సీఎం అధికారులను, మంత్రులను ఆదేశించారు.

ఆన్‌లైన్ ద్వారా రైతుల భాగస్వామ్యం

గతంలో ఈ సభ కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఇప్పుడు వేదిక హైదరాబాద్‌కు మారినప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతులు నష్టపోకుండా ప్రణాళిక సిద్ధం చేశారు. అన్ని జిల్లాల లోని రైతులు తమ ప్రాంతాల్లోని 'రైతు వేదికల' ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలో ఈ సమావేశంలో ప్రత్యక్షంగా పాల్గొనేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

వాన ముసురులో రైతు సభ వాయిదా

- **రైతు భరోసా పంపిణీ తర్వాతే వేడుక**
- **బురదమయంగా మారిన సభా ప్రాంగణం**

ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ కార్యక్రమాలను మెచ్చి వరుణ దేవుడు కరుణించాడని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురం గ్రామంలో ఈ నెల 30న తలపెట్టిన భారీ 'రైతు ఆశీర్వాద సభ'ను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల సభా ప్రాంగణం అంతా బురదమయంగా మారిందని చెప్పారు. ఈ వాతావరణం వల్ల సభకు వచ్చే రైతులు, ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతోనే సభ నిర్వహణలో మార్పులు చేసినట్లు స్పష్టం చేశారు.

ముగింపు వేడుకగా నిర్వహించేలా మార్పు

సభా ప్రాంతాన్ని సోమవారం మధ్యాహ్నం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. లక్షలాది మంది రైతుల సమక్షంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేబినెట్ మంత్రులందరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించాలని భావించామన్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో ఇక్కడ సభ నిర్వహించడం సాధ్యం కాదన్నారు. తొలిరోజు ప్రారంభ సభగా అనుకున్న ఈ కార్యక్రమాన్ని, ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా రైతు భరోసా నిధుల పంపిణీ పూర్తి అయిన తర్వాత మరింత ఉత్సాహంగా 'రైతు ఆశీర్వాద సభ' పేరుతో ఘనమైన ముగింపు వేడుకగా నిర్వహిస్తామని వెల్లడించారు. వర్షాలు తగ్గి వాతావరణం అనుకూలించిన తర్వాత, వచ్చే జూలై 6, 7 లేదా 8వ తేదీల్లో ఈ సభను నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.

ఫ్రాన్స్‌లో వెయ్యి మంది మృతి

- **యూరప్‌ను వణికిస్తున్న ఎండలు**
- **వాతావరణ మార్పులతో ప్రాణ నష్టం**

యూరప్ ఖండాన్ని అతలాకుతలం చేస్తున్న తీవ్రమైన వేసవి వడగాల్పుల కారణంగా ఫ్రాన్స్‌లో ఇప్పటివరకు కనీసం వెయ్యి మంది అదనంగా మరణించినట్లు ఆ దేశ ప్రజా ఆరోగ్య సంస్థ వెల్లడించింది. మరణించిన వారిలో ఎక్కువ మంది 65 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న వృద్ధులే ఉన్నారని ఫ్రెంచ్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఇళ్లలో, వృద్ధాశ్రమాలలో సంభవించిన మరణాల పూర్తి వివరాలు అందిన తర్వాత ఈ మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. జూన్ 20 నుండి ప్రారంభమైన ఈ తీవ్రమైన వేడి కారణంగా అనేక పాఠశాలలు, మ్యూజియంలను ముందుగానే మూసివేస్తున్నారు.

యూరప్ వ్యాప్తంగా ఎండల తీవ్రత

ప్రస్తుతం ఐరోపా వ్యాప్తంగా దాదాపు 19.1 కోట్ల మంది ప్రజలు 35 డిగ్రీల కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా జర్మనీ, చెక్ రిపబ్లిక్, హంగేరి, పోలాండ్ దేశాలలో ఎండ తీవ్రత చాలా ఎక్కువగా ఉంది. వీటితో పాటు ఇటలీ, ఆస్ట్రియా, సెర్బియా, ఉక్రెయిన్ వంటి దేశాలు కూడా ఈ వడగాల్పుల ప్రభావానికి గురవుతున్నాయి. ఫ్రాన్స్‌లో కొన్ని ప్రాంతాలలో వేడి తగ్గినప్పటికీ ఈ ఎండల ప్రభావం మరో పది రోజుల పాటు కొనసాగే అవకాశం ఉందని ఆ దేశ ఆరోగ్య శాఖ మంత్రి స్టెఫానీ రిస్ట్ హెచ్చరించారు.

జర్మనీలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు

జర్మనీలో ఎండల తీవ్రత తట్టుకోలేక చెరువులు, నదులలో ఈతకు వెళ్లిన వారిలో కనీసం ఏడుగురు ప్రమాదవశాత్తు మునిగి మరణించారు. జర్మనీలో చాలా చోట్ల ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. తూర్పు జర్మనీలోని కుబ్‌షుట్జ్ ప్రాంతంలో రాత్రి వేళ కూడా ఉష్ణోగ్రత 29.4 డిగ్రీల కంటే తగ్గకపోవడం గమనార్హం. గత 150 సంవత్సరాల వాతావరణ చరిత్రలో ఇంతటి వెచ్చని రాత్రి నమోదు కావడం ఇదే మొదటిసారి. జర్మనీ, డెన్మార్క్, చెక్ రిపబ్లిక్ దేశాలలో గత శనివారం ఆల్‌టైమ్ రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

వాతావరణ మార్పులే ప్రధాన కారణం

మానవ తప్పిదాల వల్ల జరుగుతున్న వాతావరణ మార్పుల వల్లే ఈ విధమైన అసాధారణ పరిస్థితులు ఏర్పడుతున్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 'ఒమేగా బ్లాక్' అనే ప్రత్యేక వాతావరణ మార్పుల ప్రక్రియ కారణంగా ఒకే చోట వేడి గాలి పెద్ద ఎత్తున నిలిచిపోవడంతో ఈ తీవ్రమైన వడగాల్పులు వీస్తున్నాయి. రాబోయే రోజుల్లో ఈ వేడి తగ్గినప్పటికీ ఐరోపా వ్యాప్తంగా భారీ ఈదురుగాలులతో కూడిన ఉరుముల వానలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

సెంటర్ వర్సెస్ స్టేట్

- **గ్రామీణాభివృద్ధి పథకాల్లో తెలంగాణ వెనకబాటు**
- **కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు**
- **కేంద్రం సహకరిస్తేనే అభివృద్ధి సాధ్యమన్న సీతక్క**

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం వెనుకబడి ఉందని కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. వివిధ పథకాల పురోగతిని పరిశీలించినప్పుడు ఈ విషయం స్పష్టంగా కనిపించిందని ఆయన పేర్కొన్నారు. సోమవారం న్యూఢిల్లీలో గ్రామీణాభివృద్ధి పథకాల అమలుపై కేంద్రమంత్రి అధ్యక్షతన ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ ముఖ్యమైన సమావేశానికి దేశ వ్యాప్తంగా 27 రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రులు హాజరయ్యారు.

పనులు వేగవంతం చేయాలని ఆదేశం

తెలంగాణ రాష్ట్రంలో పీఎంజీఎస్‌వై రహదారుల పనులు చాలా మందకొడిగా సాగుతున్నాయని, వాటిని తక్షణమే వేగవంతం చేయాలని కేంద్రమంత్రి సూచించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వీటితో పాటు పీఎం ఆవాస్ యోజన సర్వేను వేగంగా ముగించాలని తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రితో పాటు ఉన్నతాధికారులను కోరారు. గ్రామీణాభివృద్ధి శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని స్పష్టం చేశారు. జూలై 1వ తేదీ నుండి దేశంలో 'వికసిత్ భారత్ గ్రామీణ యోజన' అమలు చేస్తున్నామని, రాష్ట్రాలు తమ నిధుల వాటాను సమయానికి విడుదల చేయాలని కోరారు.

కేంద్ర విధానంపై తెలంగాణ అభ్యంతరం
రాష్ట్రాలపై ఆర్థిక భారం వేయొద్దన్న సీతక్క

కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి పథకాలకు సంబంధించి తీసుకువస్తున్న సరికొత్త నిధుల విధానాలపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. సోమవారం ఢిల్లీలో జరిగిన జాతీయ గ్రామీణాభివృద్ధి సదస్సులో రాష్ట్ర మంత్రి సీతక్క పాల్గొన్నారు. కేంద్రం ప్రతిపాదించిన వీబీజీ రామ్ పథకంలో కొత్తగా ప్రవేశపెడుతున్న 60:40 నిధుల విధానం వల్ల రాష్ట్రాలపై ఊహించని రీతిలో భారీ ఆర్థిక భారం పడుతుందని ఆమె స్పష్టం చేశారు. ఈ పథకాన్ని కొనసాగించాలా లేదా అనే అంశంపై జూలై 2న జరగబోయే రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఒక తుది నిర్ణయం తీసుకోనున్నట్లు వెల్లడించారు. కేంద్ర సహకారం ఉంటేనే రాష్ట్రాల అభివృద్ధి సాధ్యమవుతుందని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

డూప్లికేట్ ఓట్లే కారణం

కొడంగల్‌లో రేవంత్ గెలుపుపై కవిత ఆరోపణలు



దేశంలో ఇప్పటి వరకు ఎనిమిది సార్లు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జరిగినట్లు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ ఓట్ల అక్రమాలపై తీవ్ర విమర్శలు చేశారు. బోధన్ నియోజకవర్గంలో కేవలం ఏడాది కాలంలోనే ఏడు వేల ఓట్లను తొలగించారని, దీనిపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రముఖ నటుడు ప్రకాష్ రాజ్‌కు రెండు చోట్ల ఓట్లు ఉంటే వాటిని తొలగించడానికి ఏడేళ్ల సమయం పట్టిందని ఆమె ఈ సందర్భంగా గుర్తుచేశారు.

కొడంగల్‌లో భారీ అక్రమాలు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో ఓట్ల సవరణ సరిగా జరగలేదని కవిత ఆరోపించారు. అక్కడ కేవలం 800 ఓట్లను మాత్రమే తొలగించారని చెప్పారు. తమ పార్టీ పరంగా పరిశీలన జరిపినప్పుడు కొడంగల్‌లో ఏకంగా 33 వేల డూప్లికేట్ ఓట్లు ఉన్నట్లు తేలిందని ఆమె వెల్లడించారు. గత ఎన్నికల్లో రేవంత్ రెడ్డి 32 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారని, ఈ డూప్లికేట్ ఓట్ల వల్లే ఆయన గెలిచారనే బలమైన అనుమానం తమకు ఉందని కవిత స్పష్టం చేశారు.

అంతర్రాష్ట్ర డేటా పరిశీలన డిమాండ్

పక్క రాష్ట్రమైన కర్ణాటక నుండి డబ్బులతో పాటు ఓట్లు కూడా బదిలీ అయ్యాయా అనే సందేహం కలుగుతోందని కవిత వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లో నివసిస్తున్న చాలా మంది ఓటర్లకు ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఓట్లు ఉన్నాయని ఆమె చెప్పారు. దేశవ్యాప్తంగా ఓటర్ల సవరణ జరుగుతున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం రెండు రాష్ట్రాల మధ్య ఉన్న ఓటర్ల డేటాను తక్షణమే పరిశీలించాలని సూచించారు. ఎవరికైనా ఒకే చోట ఓటు హక్కు ఉండేలా చూడాలని, అంతర్రాష్ట్ర డూప్లికేట్ ఓట్లను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయనున్నట్లు కవిత ప్రకటించారు.

స్టాలిన్ జోస్యం

- **విజయ్ సర్కార్ కూలడం ఖాయం**
- **6 నెలల్లో తమిళనాడు ఎన్నికలు**
- **డీఎంకే చీఫ్ సంచలన వ్యాఖ్యలు**

తమిళనాడు రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం, ప్రభుత్వం ఐదేళ్ల పూర్తి పదవీకాలాన్ని పూర్తి చేయదని డీఎంకే అధ్యక్షుడు, మాజీ సీఎం ఎంకే స్టాలిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాబోయే మూడు నుండి ఆరు నెలల కాలంలోనే విజయ్ నేతృత్వంలోని మైనారిటీ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. ప్రస్తుత అధికార ప్రభుత్వం ఎంతమాత్రం స్థిరంగా లేదని, రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు చాలా వేగంగా మారుతున్నాయని వ్యాఖ్యానించారు.

కూటమి మద్దతుపై ఆధారపడిన ప్రభుత్వం

డీఎంకే పార్టీలో కొందరు కీలక కార్యకర్తల చేరిక సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో స్టాలిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. తమ ప్రగతిశీల కూటమిలోని కొన్ని పార్టీల వ్యూహాత్మక పొత్తు, మద్దతు వల్లే ఈ టీవీకే ప్రభుత్వం ప్రస్తుతం మనుగడ సాగించగలుగుతోందని గుర్తుచేశారు. ఇది అత్యంత అస్థిరమైన ఏర్పాటని, ఈ ప్రభుత్వ వాహనం ఏ కూడలిలో అకస్మాత్తుగా ఆగిపోతుందో ఎవరికీ తెలియదని ఎద్దేవా చేశారు.



ఎన్నికలకు సిద్ధమవ్వాలని పిలుపు

రాష్ట్రంలో ఐదేళ్ల కాలం పాటు వేచి ఉండే పరిస్థితి లేదని, ముందస్తు ఎన్నికలు ఎప్పుడైనా రావచ్చునని స్టాలిన్ స్పష్టం చేశారు. అవి మూడు నెలల్లో రావచ్చు లేదా ఆరు నెలల్లోనే జరగవచ్చునని అంచనా వేశారు. ఎలాంటి రాజకీయ పరిస్థితులు ఎదురైనా ఎదుర్కోవడానికి నూటికి నూరు శాతం సిద్ధంగా ఉండాలని డీఎంకే శ్రేణులకు, కార్యకర్తలకు ఆయన బలమైన పిలుపునిచ్చారు

విజయ్ గేమ్ షురూ..

- **అన్నాడీఎంకేకు బిగ్ స్ట్రోక్**
- **రాజీనామా చేసిన మరో ఎమ్మెల్యే**

తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అన్నాడీఎంకే పార్టీకి చెందిన మరో ముఖ్య నేత, కరూర్ ఎమ్మెల్యే ఎంఆర్ విజయభాస్కర్ తన పదవికి రాజీనామా చేశారు. సోమవారం చెన్నైలోని రాష్ట్ర సచివాలయంలో అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌ను కలిసి ఆయన తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. నిబంధనలను పరిశీలించిన అనంతరం స్పీకర్ ఈ రాజీనామాను తక్షణమే ఆమోదించారు. తాజా అసెంబ్లీ ఎన్నికల తర్వాత అన్నాడీఎంకేను వీడిన ఎమ్మెల్యేల సంఖ్య దీనితో ఆరుకు చేరింది.

పడిపోతున్న పార్టీ బలం

గతంలో జయలలిత మంత్రివర్గంలో రవాణా శాఖ మంత్రిగా విజయభాస్కర్ బాధ్యతలు నిర్వహించారు. ఈయన ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కరూర్ నియోజకవర్గం నుండి ఘన విజయం సాధించారు. అయితే పార్టీలో జరుగుతున్న అంతర్గత పరిణామాల వల్ల ఆయన బయటకు వచ్చారు. రెండు వారాల క్రితమే నలుగురు అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి అధికార టీవీకే పార్టీలో చేరారు. ఇప్పుడు విజయభాస్కర్ రాజీనామాతో అసెంబ్లీలో అన్నాడీఎంకే బలం 41 స్థానాలకు పడిపోయింది.

ఉప ఎన్నికల దిశగా నియోజకవర్గాలు

విజయభాస్కర్ కూడా అధికార టీవీకే పార్టీలోనే చేరుతారనే ప్రచారం బలంగా సాగుతోంది. ముఖ్యమంత్రి విజయ్ వదులుకున్న తిరుచ్చి స్థానంతో పాటు విజయభాస్కర్ రాజీనామా చేసిన కరూర్ నియోజకవర్గం కలిపి ప్రస్తుతం తమిళనాడులో మొత్తం ఏడు అసెంబ్లీ స్థానాలు ఖాళీ అయ్యాయి. రాబోయే రోజుల్లో ఈ నియోజకవర్గాలన్నింటికీ కేంద్ర ఎన్నికల సంఘం ఉప ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుంది. ఈ పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర ఉత్కంఠను రేపుతున్నాయి.



ప్రభాత కిరణమ్
సత్యానికి వారధి
4
GENERAL NEWS
మంగళవారం 30 జూన్ 2026
www.prabhathakiranam.com

సీఎం రేవంత్‌ను కలిసిన రాజు కొండా

సమాచార, పౌరసంబంధాల శాఖ క్రియేటివ్ డైరెక్టర్‌గా నియమితులైన రాజు కొండా సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసిన ఆయనకు సీఎం అభినందనలు తెలిపారు. మూడేళ్ల కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియామకం పొందిన రాజు కొండా, తనకు అవకాశం కల్పించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

- నగదు బహుమతులు అందించిన దేవాంగ సంఘం
- పురస్కారాలకు లక్ష విరాళమిచ్చిన నిమ్మల అంబరీష్

విజయవాడలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల కార్యక్రమం జరిగింది. ఈ సభలో ప్రతి విద్యార్థికి సంఘం తరపున రూ. 5,116 అందించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మల అంబరీష్ 1,04,000 రూపాయలు, ప్రముఖ వ్యాపారవేత్త బొమ్మన దుర్గ ప్రసాద్ రావు 55,000 రూపాయల ఆర్థిక సాయాన్ని సభా ప్రాంగణంలోనే నగదు రూపంలో అందజేసి విద్యార్థులను ప్రోత్సహించారు. మార్చి 2026 పరీక్షలలో రాష్ట్రంలోని 26 జిల్లాల నుండి ప్రథమ స్థాయిలో మార్కులు సాధించిన వారిని ఇక్కడ సత్కరించారు. మాజీ పార్లమెంట్ సభ్యుడు నిమ్మల కిష్టప్ప విద్యార్థులు పైచదువుల్లో ఎలా రాణించాలో ఎంతో సులభంగా వివరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రిటైర్డ్ ఐఏఎస్ తొగర్ల చిరంజీవులు తన బాల్యాన్ని గుర్తు చేసుకుంటూ పిల్లల్లో ఉత్సాహం నింపారు. టీడీపీ యువనేత నిమ్మల అంబరీష్.. దేవాంగ సంఘం అధ్యక్షుడు పూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి మాడిశెట్టి శివశంకరయ్య, కోశాధికారి కొండపల్లి పరమేశ్వర రావు, నక్కిన చిన వెంకట రాయుడు, బండారు ఆనంద్ ప్రసాద్, డాక్టర్ సజ్జ

హేమలత, చంగల మహేష్, బల్ల వెంకటరమణ, ముప్పన వీరాజు, బండ్ల బాబు, కార్టూనిస్ట్ మాడా రాము, మన్నెం సతీష్ తదితర దేవాంగ ప్రముఖులు పాల్గొన్నారు. దాదాపు 250 మంది హాజరైన ఈ సభ విజయవంతంగా ముగిసింది. ప్రతిభావంతులైన పిల్లలను గుర్తించి ప్రోత్సహించడం సమాజ బాధ్యత అని వక్తలు కొనియాడారు.

రామమందిరం విరాళాల చోరీ

సంఘ్ పరివార్‌కు సంకటం

వివరాలు 5లో..

- అయోధ్య అక్రమాలపై విచారణ
- యూపీ ఎన్నికల వేళ బీజేపీకి దెబ్బ
- అయోధ్యకూ తిరుమల తరహా బోర్డు!
- నిధుల దుర్వినియోగం... భక్తుల్లో ఆవేదన!

అయోధ్య రామమందిరానికి భక్తులు సమర్పించిన విరాళాల నిధులు పక్కదారి పట్టడం దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ అవినీతి వ్యవహారంలో ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేయడం, వారిని 14 రోజుల జుడీషియల్ కస్టడీకి తరలించడం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నాయకత్వంలోని సంఘ్ పరివార్‌లో పెద్ద కలకలం రేపింది. వచ్చే ఏడాది ఆరంభంలో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ నిధుల దుర్వినియోగం చోటుచేసుకోవడం భారతీయ జనతా పార్టీకి రాజకీయంగా పెద్ద ఎదురుదెబ్బగా మారింది. బాబ్రీ మసీదు స్థానంలో రామాలయ నిర్మాణం కోసం సుదీర్ఘ ఉద్యమం చేపట్టి, దేశంలో సాంస్కృతిక జాతీయవాదాన్ని బలోపేతం చేసిన శక్తుల నైతిక ఆధిక్యాన్ని ఈ ఘటన పూర్తిగా దెబ్బతీసింది. హిందుత్వ వాదులు ఇప్పుడు ఈ అవినీతిపై ప్రజలకు సమాధానం చెప్పుకోవాల్సిన ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో, ఆలయ నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్రా కీలక ప్రతిపాదన చేశారు. భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలకు తావులేకుండా, మరింత పారదర్శకత వృత్తిపరమైన పర్యవేక్షణ కోసం అయోధ్య రామమందిర నిర్వహణను కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిధిలోని తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు తరహాలోనే ఒక చట్టబద్ధమైన స్వయంప్రతిపత్తి సంస్థకు అప్పగించాలని ఆయన సూచించారు.

ఏఐ చిత్రం

అయోధ్య నిధుల వివాదం

అత్యవసర విచారణకు సుప్రీంకోర్టు తిరస్కరణ

అయోధ్య లాయర్ల సంచలన తీర్మానం

నిందితుల తరపున వాదించమన్న లాయర్లు

బార్ అసోసియేషన్ సంచలన నిర్ణయం

8 మంది దొంగలకు రిమాండ్

- 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ

అయోధ్య రామాలయం విరాళాల దుర్వినియోగం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అరెస్టయిన ఎనిమిది మంది నిందితులకు ప్రత్యేక అవినీతి నిరోధక న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. దర్యాప్తు ఇంకా కొనసాగుతున్నందున నిందితులను జైలులో ఉంచాల్సిన అవసరముందని పోలీసులు కోర్టుకు వివరించారు. దీనితో న్యాయస్థానం ఆదేశాల మేరకు నిందితులు జూలై 13 వరకు జైలులోనే ఉండనున్నారు. వీరంతా రామాలయానికి వచ్చిన విరాళాల నగదు, విలువైన వస్తువుల లెక్కింపు, నిర్వహణ బాధ్యతల్లో పనిచేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

వరంగల్ ఖిల్లాపై కాషాయ జెండా ఎగరాలి

ప్రధాని మోదీ పాలనలోనే దేశ ప్రగతి

భారత్ విశ్వగురుగా ఎదుగుతోందన్న బీజేపీ చీఫ్

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో భారతదేశం ప్రపంచంలోనే విశ్వగురుగా ఎదుగుతోందని భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. హనుమకొండలో నిర్వహించిన భాజపా బూత్ అధ్యక్షుల సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పన్నెండేళ్ల మోదీ సమర్థవంతమైన పాలనలో దేశవ్యాప్తంగా దాదాపు 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుండి విముక్తి పొందారని ఆయన స్పష్టం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కల సాకారం కావడంలో బీజేపీ పాత్ర ఎంతో ఉందని, నాడు పార్లమెంట్‌లో సుష్మాస్వరాజ్ గళం విప్పి ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. (వివరాలు 5లో..)

జీవితం వంద మీటర్ల పరుగు పందెం కాదు

» ఓపిక, నిలకడగా పనులు పూర్తి చేయాలి
» తెలంగాణలో అధికారానికి చేరువలో బీజేపీ
» యువతకు నితిన్ నబీన్ దిశానిర్దేశం

డూప్లికేట్ ఓట్లే కారణం

కొడంగల్‌లో రేవంత్ గెలుపుపై కవిత ఆరోపణలు

దేశంలో ఇప్పటి వరకు ఎనిమిది సార్లు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జరిగినట్లు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ ఓట్ల అక్రమాలపై తీవ్ర విమర్శలు చేశారు. బోధన్ నియోజకవర్గంలో కేవలం ఏడాది కాలంలోనే ఏడు వేల ఓట్లను తొలగించారని, దీనిపై ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. (వివరాలు 3లో..)

3లో..

విజయ్ గేమ్ షురూ..

- అన్నాడీఎంకేకు బిగ్ స్ట్రోక్
- రాజీనామా చేసిన మరో ఎమ్మెల్యే

తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. అన్నాడీఎంకే పార్టీకి చెందిన మరో ముఖ్య నేత, కరూర్ ఎమ్మెల్యే ఎంఆర్ విజయభాస్కర్ తన పదవికి రాజీనామా చేశారు. సోమవారం చెన్నైలోని రాష్ట్ర సచివాలయంలో అసెంబ్లీ స్పీకర్ జేసీడీ ప్రభాకర్‌ను కలిసి ఆయన తన రాజీనామా పత్రాన్ని సమర్పించారు. నిబంధనలను పరిశీలించిన అనంతరం స్పీకర్ ఈ రాజీనామాను తక్షణమే ఆమోదించారు. తాజా అసెంబ్లీ ఎన్నికల తర్వాత అన్నాడీఎంకేను వీడిన ఎమ్మెల్యేల సంఖ్య దీనితో ఆరుకు చేరింది.

స్టాలిన్ జోస్యం
విజయ్ సర్కార్ కూలడం ఖాయం

- 6 నెలల్లో తమిళనాడు ఎన్నికలు
- డీఎంకే చీఫ్ సంచలన వ్యాఖ్యలు

అసెంబ్లీ రద్దు సవాల్‌పై కౌంటర్

హరీష్‌రావుకు మెంటల్ బ్యాలెన్స్ తప్పింది

ఆరోపణలపై నిప్పులు చెరిగిన పొంగులేటి

మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతున్న తీరు చూస్తుంటే ఆయనకు మెంటల్ బ్యాలెన్స్ తప్పిందనే అనుమానం కలుగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తీవ్రంగా విమర్శించారు. సోమవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. (వివరాలు 5లో..)

అధికార అహంకారంతో విర్రవీగుతున్నావ్

మంత్రి పొంగులేటిపై బీఆర్ఎస్ నిప్పులు

మెంటల్ బ్యాలెన్స్ తప్పింది మాజీ మంత్రి హరీష్‌రావుకు కాదని, అధికార అహంకారంతో విర్రవీగుతున్నది మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాత్రమేనని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ శ్రవణ్ దాసోజు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని, ప్రతిపక్షాలను కాంగ్రెస్ ప్రభుత్వం నికార్సైన అహంకారంతో అవహేళన చేస్తోందని ఆరోపించారు. ప్రజల పక్షాన నిలబడి హరీష్ రావు సవాలు విసిరితే దానికి సమాధానం చెప్పలేక మంత్రి వ్యక్తిగత దూషణలకు దిగడం దారుణమన్నారు. (వివరాలు 5లో..)



ఫ్రాన్స్‌లో వెయ్యి మంది మృతి

- యూరప్‌ను వణికిస్తున్న ఎండలు
- వాతావరణ మార్పులతో ప్రాణ నష్టం

యూరప్ ఖండాన్ని అతలాకుతలం చేస్తున్న తీవ్రమైన వేసవి వడగాల్పుల కారణంగా ఫ్రాన్స్‌లో ఇప్పటివరకు కనీసం వెయ్యి మంది అదనంగా మరణించినట్లు ఆ దేశ ప్రజా ఆరోగ్య సంస్థ వెల్లడించింది. మరణించిన వారిలో ఎక్కువ మంది 65 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు ఉన్న వృద్ధులే ఉన్నారని ఫ్రెంచ్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంది. (వివరాలు 3లో..)

ఖమ్మం సభ రద్దు

- శిల్పకళా వేదిక నుంచే రైతుభరోసా
- వాన దెబ్బకు మారిన సీఎం సభ వేదిక

ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో మంగళవారం జరగాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'రైతు ఆశీర్వాద సభ' రద్దయింది. మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాథపురంలో దాదాపు లక్ష మందితో ఈ భారీ సభను నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సభా ప్రాంగణంలోకి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరింది. అక్కడ సభ నిర్వహించే పరిస్థితి లేకపోవడంతో జిల్లా అధికారులు ఈ విషయాన్ని ముఖ్యమంత్రి కార్యాలయానికి నివేదించారు. దీంతో ప్రభుత్వం ఖమ్మం సభను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. (వివరాలు 3లో..)

వాన ముసురులో రైతు సభ వాయిదా

రైతు భరోసా పంపిణీ తర్వాతే వేడుక

- బురదమయంగా మారిన సభా ప్రాంగణం

ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ కార్యక్రమాలను మెచ్చి వరుణ దేవుడు కరుణించాడని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురం గ్రామంలో ఈ నెల 30న తలపెట్టిన భారీ 'రైతు ఆశీర్వాద సభ'ను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల సభా ప్రాంగణం అంతా బురదమయంగా మారిందని చెప్పారు. ఈ వాతావరణం వల్ల సభకు వచ్చే రైతులు, ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతోనే సభ నిర్వహణలో మార్పులు చేసినట్లు స్పష్టం చేశారు. (వివరాలు 3లో..)

3లో..

128 ఏళ్ల తర్వాత క్రికెట్‌కి చోటు

» ఒలింపిక్స్‌లో క్రికెట్ పండుగ
» నెంబర్ 1 పొజిషన్‌తో భారత్ ఎంట్రీ
» తాజాగా మహిళల జట్టుకు చోటు

3లో..

సెంటర్ వర్సెస్ స్టేట్

» గ్రామీణాభివృద్ధి పథకాల్లో తెలంగాణ వెనకబాటు
» కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు
» కేంద్రం సహకరిస్తేనే అభివృద్ధి సాధ్యమన్న సీతక్క

ఖానాపూర్ ఎమ్మెల్యే తిరుగుబాటు

సొంత పార్టీపైనే వెడ్మ బొజ్జు ఆరోపణలు

ఆదిలాబాద్ జిల్లా రాజకీయాల్లో ఖానాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. జిల్లా కేంద్రంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సొంత ప్రభుత్వంపైనే బహిరంగంగా సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ విపక్ష బీజేపీ ఎమ్మెల్యేలకే మంత్రులు, అధికారులు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. (వివరాలు 3లో..)

• రామమందిరం విరాళాల చోరీ

సంఘ్ పరివార్‌కు సంకటం

అయోధ్య అక్రమాలపై విచారణ

- యూపీ ఎన్నికల వేళ బీజేపీకి దెబ్బ
- అయోధ్యకూ తిరుమల తరహా బోర్డు!
- నిధుల దుర్వినియోగం... భక్తుల్లో ఆవేదన!

అయోధ్యలోని రామమందిరానికి భక్తులు సమర్పించిన విరాళాల నిధులు పక్కదారి పట్టడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ అవినీతి వ్యవహారంలో ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేయడం ఆర్ఎస్ఎస్ నాయకత్వంలోని సంఘ్ పరివార్‌లో తీవ్ర కలకలం రేపింది. వచ్చే ఏడాది ఆరంభంలో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. బాబ్రీ మసీదు స్థానంలో రామమందిర నిర్మాణం కోసం సుదీర్ఘ ఉద్యమం చేపట్టిన వారికి ఈ ఘటన వల్ల పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఎంతో పవిత్రంగా భావించిన ఈ ఉద్యమ పారదర్శకతపై ఇప్పుడు ప్రజల్లో అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీనివల్ల భారతీయ జనతా పార్టీ తన నైతిక ఆధిక్యాన్ని కోల్పోవాల్సి వచ్చింది.

రాజకీయాలపై తీవ్ర ప్రభావం

హిందుత్వ సిద్ధాంతాన్ని బలంగా నమ్మే వారికి ఈ అవినీతి వ్యవహారం మింగుడుపడటం లేదు. ఈ నిధుల దుర్వినియోగం వెనుక ఎవరెవరి హస్తం ఉందనే విషయాలు రోజురోజుకూ ఇబ్బందికరంగా మారుతున్నాయి. రాబోయే ఎన్నికలను ఎదుర్కోవాలంటే బీజేపీ ప్రభుత్వం ఈ వ్యవహారంపై చాలా వేగంగా స్పందించాల్సి ఉంటుంది. తప్పు చేసిన వారిని తక్షణమే గుర్తించి కఠినంగా శిక్షించకపోతే ఎన్నికల ప్రచారంలో ప్రజలకు సమాధానం చెప్పుకోవడం కష్టంగా మారుతుంది. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు మొదట్లోనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని డిమాండ్ చేసినప్పటికీ నష్టం అప్పటికే జరిగిపోయింది.

అంతర్గత విభేదాలు దర్యాప్తు

సంఘ్ పరివార్ లోపల కూడా ఈ వైఫల్యానికి బాధ్యులు ఎవరనే దానిపై చర్చలు మొదలయ్యాయి. ఈ ట్రస్ట్‌లో గతంలో మందిర ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మందిర ఉద్యమంతో సంబంధం ఉన్నప్పటికీ, ఈ అవినీతిని క్లియర్ చేసే బాధ్యతను ప్రభుత్వ దర్యాప్తు సంస్థలకు అప్పగించారు. ప్రభుత్వ విచారణ ద్వారా నిజా నిజాలను బయటకు తీసి పార్టీ ప్రతిష్ఠను కాపాడటానికి ప్రయత్నిస్తున్నారు. ఈ చిన్న వ్యత్యాసం సంఘ్ పరివార్ అంతర్గత రాజకీయాల్లో బీజేపీకి కొంత ఊరటనిచ్చే అంశంగా మారింది.

ప్రైవేటు ట్రస్టుల వాదన బలహీనం

హిందూ దేవాలయాల నిర్వహణను ప్రభుత్వాల ఆధీనం నుండి తొలగించి ప్రైవేట్ వ్యక్తులకు లేదా ప్రత్యేక ట్రస్టులకు అప్పగించాలనే డిమాండ్ దేశంలో చాలా కాలంగా ఉంది. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలోని ప్రముఖ ఆలయాలు దేవదాయ శాఖల పర్యవేక్షణలో ఉండటాన్ని కొందరు వ్యతిరేకిస్తూ వచ్చారు. అయితే అయోధ్య మందిరంలో జరిగిన ఈ విరాళాల చోరీ ఘటనతో ప్రైవేట్ ట్రస్టుల నిర్వహణపై నమ్మకం సడలింది. హిందూ దేవాలయాలను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెడితే ఇలాంటి అవినీతి జరుగుతుందనే వాదనకు ఇప్పుడు బలం చేకూరింది.

తిరుమల తరహా బోర్డు ఏర్పాటు ప్రతిపాదన

ఈ విరాళాల దుర్వినియోగం నేపథ్యంలో ఆలయ నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్రా ఒక కీలకమైన ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. అయోధ్య రామ మందిర నిర్వహణను కూడా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పరిధిలోని తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ఒక చట్టబద్ధమైన బోర్డుకు అప్పగిస్తే బాగుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ పర్యవేక్షణ ఉండటం వల్ల ఆలయ నిర్వహణలో పారదర్శకత పెరుగుతుందని, వృత్తిపరమైన పర్యవేక్షణ సాధ్యమవుతుందని చెప్పారు. భారత రాజకీయాల స్వరూపాన్నే మార్చేసిన ఒక గొప్ప ఉద్యమానికి ఈ నిధుల చోరీ వ్యవహారం ఒక మరకగా మిగిలిపోనుంది.

8 మంది దొంగలకు రిమాండ్

- 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ

అయోధ్య రామాలయం విరాళాల దుర్వినియోగం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అరెస్టయిన ఎనిమిది మంది నిందితులకు ప్రత్యేక అవినీతి నిరోధక న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. దర్యాప్తు ఇంకా కొనసాగుతున్నందున నిందితులను జైలులో ఉంచాల్సిన అవసరముందని పోలీసులు కోర్టుకు వివరించారు. దీనితో న్యాయస్థానం ఆదేశాల మేరకు నిందితులు జూలై 13 వరకు జైలులోనే ఉండనున్నారు. వీరంతా రామాలయానికి వచ్చిన విరాళాల నగదు, విలువైన వస్తువుల లెక్కింపు, నిర్వహణ బాధ్యతల్లో పనిచేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.
ఈ కేసును విచారిస్తున్న స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్, సిట్ నిందితుల ఇళ్లలో ముమ్మర సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో భాగంగా సుమారు 79.85 లక్షల రూపాయల దొంగిలించబడిన నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు దేవుడి సొమ్ముతో ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వారి ఆర్థిక లావాదేవీలు, బ్యాంకు ఖాతాలు, ఆస్తుల వివరాలను అధికారులు నిశితంగా తనిఖీ చేస్తున్నారు.

బ్యాంకు ఉద్యోగులపై అనుమానాలు

ఈ భారీ నిధుల దుర్వినియోగం వెనుక కొందరు బ్యాంకు ఉద్యోగుల పాత్ర కూడా ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిందితులకు వారు ఏ విధంగా సహకరించారనే కోణంలో కూడా సిట్ అధికారులు దర్యాప్తును వేగవంతం చేశారు. రాబోయే రోజుల్లో మరికొంత మంది నిందితులను విచారించడం ద్వారా ఈ దోపిడీకి సంబంధించిన మరిన్ని దిగ్భ్రాంతికర నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని దర్యాప్తు అధికారులు వెల్లడించారు.

అయోధ్య నిధుల వివాదం

- అత్యవసర విచారణకు సుప్రీంకోర్టు తిరస్కరణ

అయోధ్య రామాలయంలో భక్తులు సమర్పించిన విరాళాల నిధులు దుర్వినియోగం అయ్యాయనే వ్యవహారం దేశ అత్యున్నత న్యాయస్థానానికి చేరింది. ఈ అక్రమాలపై పూర్తి నిష్పాక్షిక విచారణ జరిపించాలని కోరుతూ సుప్రీం కోర్టులో ఒక పిటిషన్ దాఖలైంది. సీబీఐ నేతృత్వంలో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలని పిటిషనర్ కోరారు. కోర్టు పర్యవేక్షణలో, ఒక నిర్ణీత కాలవ్యవధిలో ఈ దర్యాప్తు పూర్తి అయ్యేలా ఆదేశాలు ఇవ్వాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు.

అంత తొందర ఎందుకన్న ధర్మాసనం

ఈ పిటిషన్‌పై తక్షణమే విచారణ చేపట్టాల్సిన అత్యవసర పరిస్థితులు ఏవీ లేవని జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ షీల్ నాగులతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. కేసు ఆలస్యమైతే ఎలక్ట్రానిక్ ఆధారాలు చెరిపివేసే అవకాశం ఉందని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. ప్రస్తుతం అంత తొందర ఏమొచ్చిందని, సుప్రీంకోర్టు పునఃప్రారంభం అయిన తర్వాత ఈ కేసును జాబితా చేసి విచారణ చేపడతామని తెలిపింది.

అయోధ్య లాయర్ల సంచలన తీర్మానం

- నిందితుల తరపున వాదించమన్న లాయర్లు
- బార్ అసోసియేషన్ సంచలన నిర్ణయం

అయోధ్య రామాలయం విరాళాల దుర్వినియోగం కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న తరుణంలో స్థానిక న్యాయవాదులు ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసులో అరెస్టయిన ఎనిమిది మంది నిందితుల తరపున తమ సంఘానికి చెందిన ఏ న్యాయవాదీ కోర్టులో వాదించరాదని అయోధ్య బార్ అసోసియేషన్ సోమవారం ఒక సంచలన తీర్మానం చేసింది. నిందితులను స్థానిక న్యాయస్థానంలో హాజరుపరిచిన రోజే అత్యవసరంగా నిర్వహించిన బార్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశంలో సభ్యులంతా ఏకగ్రీవంగా ఈ నిర్ణయాన్ని ఆమోదించారు.

ఉల్లంఘిస్తే భారీ జరిమానా హెచ్చరిక

ఈ సామూహిక నిర్ణయాన్ని ఉల్లంఘించి ఎవరైనా నిందితుల తరపున వకాల్తా పుచ్చుకుంటే వారిపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు ఉంటాయని బార్ అసోసియేషన్ స్పష్టం చేసింది. నియమావళిని దాటి నిందితుల పక్షాన నిలిచే న్యాయవాదికి ఐదు లక్షల రూపాయల భారీ జరిమానా విధిస్తామని అసోసియేషన్ అధ్యక్షుడు కాళికా శరణ్ మిశ్రా మీడియాకు వెల్లడించారు. కోట్ల మంది భక్తులు ఎంతో పవిత్రంగా సమర్పించిన కానుకలను దొంగిలించడం తమ మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసిందని, అందుకే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నామని లాయర్లు పేర్కొన్నారు.

ట్రస్ట్ సభ్యులకు కఠిన హెచ్చరికలు

ఇదే సమావేశంలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ అధికారులపై కూడా లాయర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్, సభ్యుడు అనిల్ మిశ్రా, ఆలయ నిర్మాణ ఇన్‌ఛార్జి గోపాల్‌రావుపై తక్షణమే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వీరంతా రాబోయే మూడు రోజుల్లోగా అయోధ్య నగరాన్ని విడిచి వెళ్లాలని హెచ్చరించారు. ఒకవేళ వారు వెళ్లకపోతే నగరవ్యాప్తంగా బంద్ చేపట్టి, రామమందిరాన్ని పూర్తిగా దిగ్బంధిస్తామని లాయర్ల సంఘం ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేసింది.

పాత జ్ఞాపకాలను గుర్తుచేస్తూ ప్రకటన

అయోధ్య న్యాయవాదులు ఇలాంటి ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడం ఇదే మొదటిసారి కాదు. గతంలో 2005 సంవత్సరంలో రామ జన్మభూమి తాత్కాలిక ఆలయంపై ఉగ్రవాదులు దాడి చేసిన సమయంలోనూ ఇక్కడి బార్ అసోసియేషన్ ఇలాగే స్పందించింది. నాడు దేశద్రోహానికి పాల్పడిన ఉగ్రవాద నిందితుల తరపున ఫైజాబాద్ కోర్టులో వాదించడానికి ఏ ఒక్క స్థానిక న్యాయవాది కూడా ముందుకు రాలేదు. ఇప్పుడు ఆలయ నిధుల దొంగతనానికి పాల్పడిన వారిని కూడా అదే కోవలో చూస్తూ లాయర్లు తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు.

వరంగల్ ఖిల్లాపై కాషాయ జెండా ఎగరాలి

- ప్రధాని మోదీ పాలనలోనే దేశ ప్రగతి
- భారత్ విశ్వగురుగా ఎదుగుతోందన్న బీజేపీ చీఫ్

ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో భారతదేశం ప్రపంచంలోనే విశ్వగురుగా ఎదుగుతోందని భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. హనుమకొండలో నిర్వహించిన భాజపా బూత్ అధ్యక్షుల సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పన్నెండేళ్ల మోదీ సమర్థవంతమైన పాలనలో దేశవ్యాప్తంగా దాదాపు 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుండి విముక్తి పొందారని ఆయన స్పష్టం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కల సాకారం కావడంలో బీజేపీ పాత్ర ఎంతో ఉందని, నాడు పార్లమెంట్‌లో సుష్మాస్వరాజ్ గళం విప్పి ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు.

పీవీ నర్సింహారావుకు కాంగ్రెస్ అవమానం

వరంగల్ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించాలని, వరంగల్ ఖిల్లాపై కాషాయజెండా ఎగరాలని నితిన్ నబీన్ పిలుపునిచ్చారు. విభజన రాజకీయాలు చేస్తున్న వారికి రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలన్నారు. వరంగల్ బిడ్డ, మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు ఢిల్లీలో కాంగ్రెస్ హయాంలో తీవ్ర అవమానం జరిగిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనకు సరైన గౌరవం ఇవ్వలేదని, పీవీ స్మారక నిర్మాణానికి నాడు సోనియా గాంధీ అంగీకరించలేదని ఆరోపించారు. భారతీయ జనతా పార్టీ అసలైన బలం బూత్ అధ్యక్షులు, కార్యకర్తలేనని ఆయన కొనియాడారు.

2028లో డబుల్ ఇంజన్ సర్కార్

తెలంగాణతో బీజేపీకి ఉన్న బంధం ఈనాటిది కాదని, అది పోరాటాల బంధమని నితిన్ నబీన్ స్పష్టం చేశారు. 1980లో బిజెపి స్థాపించబడిన తర్వాత జరిగిన మొదటి ఎన్నికల్లోనే దేశవ్యాప్తంగా పార్టీ గెలిచిన రెండు లోక్‌సభ స్థానాల్లో ఒకటి ఈ హనుమకొండ గడ్డ నుంచే కావడం విశేషమన్నారు. నాడు ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు సమయంలో లాభనష్టాలు చూసుకోకుండా తెలంగాణ ప్రజల ఆకాంక్షల కోసం కార్యకర్తలు పోరాడారని గుర్తుచేశారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం, సంస్కృతి సంప్రదాయాలతో కూడిన ప్రభుత్వాన్ని అందించడమే మన ధ్యేయమని చెప్పారు. కార్యకర్తల శ్రమతో 2028లో ఇక్కడ డబుల్ ఇంజన్ ప్రభుత్వాన్ని తీసుకువచ్చేందుకు అంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

జీవితం వంద మీటర్ల పరుగు పందెం కాదు

ఓపిక, నిలకడగా పనులు పూర్తి చేయాలి
తెలంగాణలో అధికారానికి చేరువలో బీజేపీ
యువతకు నితిన్ నబీన్ దిశానిర్దేశం

జీవితం అనేది వంద మీటర్ల పరుగుపందెం కాదని, అది మన ఓపికకు ఒక పెద్ద పరీక్ష అని బీజేపీ జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ వీబీఐటీ క్యాంపస్‌లో బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన 'వికసిత్ భారత్ స్టూడెంట్స్ కాంక్లేవ్'లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజకీయాల్లో తాను ఎదుర్కొన్న సవాళ్లపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. నేటి యువత చాలా వేగంగా లక్ష్యాలను చేరుకోవాలనే ఆరాటంలో ఉందని, అయితే ఏ పనినైనా ఓపిక, నిలకడ, పూర్తి శక్తితో చేసినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని యువతకు హితవు పలికారు.

వర్చువల్ పద్ధతిలో పార్టీ కార్యాలయాల ప్రారంభం

ఇదే పర్యటనలో భాగంగా రంగారెడ్డి జిల్లా రూరల్ భారతీయ జనతా పార్టీ నూతన కార్యాలయాన్ని నితిన్ నబీన్ ఘనంగా ప్రారంభించారు. దీనితో పాటు వర్చువల్ విధానం ద్వారా రాష్ట్రంలోని మరో తొమ్మిది జిల్లాల పార్టీ కార్యాలయాలను కూడా ఆయన ఒకేసారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన నిజాం నిరంకుశ పాలన నుండి తెలంగాణకు విముక్తి కల్పించిన సర్దార్ వల్లభభాయ్ పటేల్‌కు, ప్రత్యేక తెలంగాణ ఉద్యమ అమరవీరులకు ఘన నివాళులు అర్పించారు. పార్లమెంట్‌లో నాడు తెలంగాణ వాణిని బలంగా వినిపించిన దివంగత నేత సుష్మా స్వరాజ్ సేవలను కూడా ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

తెలంగాణలో కమలం వికాసం ఖాయం

గతంలో దేశవ్యాప్తంగా బీజేపీ కేవలం రెండు లోక్‌సభ స్థానాలు గెలిచినప్పుడు అందులో ఒకటి తెలంగాణ నుంచేనని నితిన్ నబీన్ గుర్తుచేశారు. ఈ స్థాయికి చేరడానికి ఎంతో మంది పార్టీ కార్యకర్తలు తమ ప్రాణాలను త్యాగం చేశారని కొనియాడారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ప్రతి మూలలోనూ కమలం వికసించి, భగవాధ్వజం ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలపై బీజేపీ కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తారని, ప్రజావ్యతిరేక పద్ధతులను అవలంబిస్తున్న ప్రస్తుత ప్రభుత్వాన్ని గద్దె దించుతారని హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌లో ఎన్నో ఆటంకాలు ఎదురైనా తీవ్రంగా పోరాడి ఎలాగైతే బలోపేతం అయ్యామో, తెలంగాణలోనూ అదే పునరావృతం అవుతుందన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే ప్రగతి

ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షిస్తున్న వికసిత భారత లక్ష్యం సంపూర్ణంగా నెరవేరాలి అంటే తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని నితిన్ నబీన్ స్పష్టం చేశారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఒకే పార్టీ అధికారంలో ఉండే డబుల్ ఇంజన్ సర్కార్ వస్తేనే తెలంగాణ అన్ని రంగాల్లో అద్భుతంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరగబోయే రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించబోతోందని ఆయన జోస్యం చెప్పారు. సాయంత్రం వేళ నితిన్ నబీన్ పార్టీకి చెందిన బీఎల్ఓలు, బూత్ కమిటీ అధ్యక్షులు, ముఖ్య కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమై రాబోయే ఎన్నికల వ్యూహాలపై దిశానిర్దేశం చేశారు.

అసెంబ్లీ రద్దు సవాల్‌పై కౌంటర్

హరీష్‌రావుకు మెంటల్ బ్యాలెన్స్ తప్పింది

ఆరోపణలపై నిప్పులు చెరిగిన పొంగులేటి

మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతున్న తీరు చూస్తుంటే ఆయనకు మెంటల్ బ్యాలెన్స్ తప్పిందనే అనుమానం కలుగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తీవ్రంగా విమర్శించారు. సోమవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. దమ్ముంటే అసెంబ్లీని రద్దు చేయాలంటూ హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలను ఆయన పూర్తిగా కొట్టిపారేశారు. తెలంగాణ ప్రజానీకం కాంగ్రెస్ పార్టీకి ఐదేళ్లపాటు పరిపాలించడానికి స్పష్టమైన తీర్పునిచ్చారని, అలాంటప్పుడు మధ్యలోనే అసెంబ్లీని ఎందుకు రద్దు చేస్తామని ప్రశ్నించారు.

ప్రతి ఎన్నికల్లో ప్రజల శిక్ష

గడిచిన కాలంలో జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ ప్రజలు బీఆర్ఎస్‌కు ఏ విధంగా బుద్ధి చెప్పారో హరీష్‌రావుకు బాగా తెలుసని పొంగులేటి ఎద్దేవా చేశారు. రెండు కాళ్లు లేనివాడు పోటీకి రమ్మని సవాలు విసిరినట్లే బీఆర్ఎస్ నాయకుల మాటలు ఉన్నాయని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ప్రభుత్వం చేసే మంచి పనులను జీర్ణించుకోలేక, భవిష్యత్తులో తమకు అధికారం దక్కదనే ఆవేశంతో కేటీఆర్ ఉక్రోషాన్ని వెళ్లగక్కుతున్నారని మండిపడ్డారు. తప్పు చేసిన వాళ్లను జైలులో వేస్తేనే శిక్ష కాదు, ప్రతి ఎన్నికల్లో వారిని ఓడిస్తూ ప్రజలు ఇప్పటికే తగిన శిక్ష వేస్తున్నారని స్పష్టం చేశారు.

బీజేపీవి పగటి కలలు

తెలంగాణలో అధికారంలోకి వస్తామని బీజేపీ పగటి కలలు కంటోందని మంత్రి విమర్శించారు. ఆశ ఉండడంలో తప్పు లేదు కానీ బీజేపీది అత్యాశ అని అన్నారు. గతంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కనీసం డిపాజిట్ కూడా దక్కించుకోలేని పార్టీ, ఇప్పుడు అధికారం గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒకే తాను ముక్కలని, కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణ కోరినా కేంద్రం ఇప్పటివరకు స్పందించకపోవడమే అందుకు నిదర్శనమని చెప్పారు.



అధికార అహంకారంతో విర్రవీగుతున్నావ్

- మంత్రి పొంగులేటిపై బీఆర్ఎస్ నిప్పులు



మెంటల్ బ్యాలెన్స్ తప్పింది మాజీ మంత్రి హరీష్ రావుకు కాదని, అధికార అహంకారంతో విర్రవీగుతున్నది మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాత్రమేనని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ శ్రవణ్ దాసోజు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని, ప్రతిపక్షాలను కాంగ్రెస్ ప్రభుత్వం నికార్సైన అహంకారంతో అవహేళన చేస్తోందని ఆరోపించారు. ప్రజల పక్షాన నిలబడి హరీష్‌రావు సవాలు విసిరితే దానికి సమాధానం చెప్పలేక మంత్రి వ్యక్తిగత దూషణలకు దిగడం దారుణమన్నారు. బాధ్యతాయుతమైన మంత్రి స్థానంలో ఉండి అంగవైకల్యాన్ని కించపరిచేలా మాట్లాడటం పొంగులేటి సంస్కారహీనతకు నిదర్శనమని ధ్వజమెత్తారు.

ఫ్యాక్షన్ లీడర్లా మాట్లాడుతున్నారంటూ విమర్శలు

కర్ర కాల్చి వాత పెడతా అనడానికి పొంగులేటి ఏమైనా ఫ్యాక్షన్ లీడరా లేక అరాచక శక్తా అని శ్రవణ్ నిలదీశారు. పొంగులేటి చేతిలో ఉన్నది రెవెన్యూ, హౌసింగ్ శాఖలు మాత్రమేనని, కానీ ఆయన మాట్లాడుతున్నది మాత్రం ఒక సూపర్ హోం మంత్రిలా ఉందని ఎద్దేవా చేశారు. డాక్టర్ ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ సెక్యూరిటీ థ్రెట్ గురించి మాట్లాడటానికి పొంగులేటి పరిధి ఏంటని ప్రశ్నించారు. పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంత్రిలా పని చేస్తున్నారా లేక హోం మంత్రి బాధ్యతలు చూస్తున్న రేవంత్ రెడ్డికి పీఏగా వ్యవహరిస్తున్నారా అంటూ కౌంటర్ ఇచ్చారు. ఇటువంటి రౌడీయిజం మాటలు, బెదిరింపులు తెలంగాణ ఉద్యమకారులపై సాగవని హెచ్చరించారు.

భూమి అంటే విలువ. ప్రభుత్వ భూమి అంటే ప్రజల ఆస్తి. ఆ ఆస్తిని కాపాడాల్సిన వ్యవస్థ బలహీనపడితే, దానిపై కన్నేసే వారి సంఖ్య పెరుగుతుంది. కానీ ఒకప్పుడు రాజకీయ అండ, అధికారుల నిర్లక్ష్యం, నకిలీ పత్రాలే భూకబ్జాలకు ఆయుధాలైతే… ఇప్పుడు వాటికి మరో కొత్త ముసుగు చేరింది. అదే "దేవుడి పేరు." భక్తి అనే పవిత్ర భావనను కవచంగా ఉపయోగించుకుని ప్రభుత్వ భూములను ఆక్రమించడం, చిన్న చిన్న దేవాలయాలు నిర్మించి ఆ తర్వాత మిగిలిన భూమిని ప్లాట్లుగా మార్చి విక్రయించడం వంటి ఆరోపణలు ఇప్పుడు బద్వేలులో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. కడప జిల్లా బద్వేలు ప్రాంతంలో గత కొన్ని దశాబ్దాలుగా ప్రభుత్వ భూములపై కబ్జాలు కొత్త విషయం కాదు. చెరువు పోరంబోకు, రోడ్డు పక్కన ఉన్న ఖాళీ స్థలాలు, గ్రామ కంఠం, అసైన్డ్ భూములు… ఏ భూమి ఖాళీగా కనిపించినా దానిపై ఎవరో ఒకరి కన్ను పడటం సహజంగా మారిపోయిందనే విమర్శలు ఉన్నాయి. అధికార పార్టీ, ప్రతిపక్షం అనే తేడా లేకుండా రాజకీయ నాయకులు, స్థానిక ప్రభావశీలులు, కొందరు మధ్యవర్తులు, కొందరు అధికారుల బినామీలు కూడా ఈ వ్యవహారాల్లో భాగమయ్యారన్న ఆరోపణలు ఎన్నోసార్లు వినిపించాయి.

భక్తి ముసుగులో.. భూబకాసురులు

దేవుడి పేరుతో దందా..
ప్రభుత్వ భూములు గోవిందా
బద్వేలులో గుడి పేరుతో కబ్జాల కొత్త ఎత్తుగడ

• మడకలవారిపల్లెలో గుడి వెనుక ప్రభుత్వ భూకబ్జా

ఈ నేపథ్యంలో తాజాగా వెలుగులోకి వచ్చిన ఒక వ్యవహారం మరింత ఆందోళన కలిగిస్తోంది. గోపవరం మండలం మడకలవారిపల్లె రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 728/4లో సుమారు 64 సెంట్ల ప్రభుత్వ భూమి, దానికి ఆనుకుని మరో 70 సెంట్ల వరకు చెరువు పోరంబోకు భూమి ఉన్నట్లు రెవెన్యూ రికార్డులు చెబుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ ప్రభుత్వ భూమిలో సుమారు 10 సెంట్లలో అయ్యప్ప స్వామి, సుబ్రహ్మణ్య స్వామి, వినాయకుడు, మహాలక్ష్మి, నవగ్రహాల ఆలయ నిర్మాణం చేపట్టినట్లు తెలుస్తోంది. స్థానికుడు వర్దిరెడ్డి నర్సిరెడ్డి ఆలయ నిర్మాణానికి ముందుకొచ్చారని గ్రామస్తులు చెబుతున్నారు. గుడి నిర్మాణం జరగడంతో స్థానిక భక్తులు కూడా దీనిని స్వాగతించారు. దేవాలయం నిర్మాణం అంటే గ్రామానికి ఆధ్యాత్మిక కేంద్రం ఏర్పడినట్టే అంటూ అందరూ భావించారు. దానికి ఎవరూ అభ్యంతరం చెప్పలేదు. కానీ ఆరోపణల ప్రకారం… అసలు కథ అక్కడి నుంచే మొదలైంది. గుడి కోసం అవసరమైన 10 సెంట్లను మాత్రమే వినియోగించి, మిగిలిన ప్రభుత్వ భూమిని అభివృద్ధి పేరుతో వినియోగించాలనే ఆలోచన మొదలైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అనంతరం నర్సిరెడ్డి మరణించగా, ఆయన కుమారులు గుడికి అవసరమైన భూమి మినహా మిగిలిన ప్రభుత్వ భూమిని తమ సొంత ఆస్తిలా భావించి విక్రయించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వానికి చెందిన భూమి ఎలా వ్యక్తిగత ఆస్తిగా మారింది? దానిని కొనుగోలు చేసిన వారికి ఏ పత్రాలు ఇచ్చారు? రిజిస్ట్రేషన్ జరిగిందా? లేక కేవలం ఒప్పందాల ద్వారానా విక్రయాలు జరిగాయి? అనే ప్రశ్నలు అన్ని చోట్లా ప్రకంపనలు సృష్టిస్తున్నాయి

• ప్రభుత్వ భూముల అక్రమ విక్రయాలు అధికారుల కూల్చివేతలు

కొనుగోలుదారులు స్థలాల్లో నిర్మాణాలు ప్రారంభించగానే రెవెన్యూ అధికారులు వచ్చి వాటిని కూల్చివేసినట్లు సమాచారం. దీంతో బాధితులు తాము డబ్బులు చెల్లించి కొనుగోలు చేశామని చెబుతుంటే, అధికారులు అది ప్రభుత్వ భూమి అని చెబుతున్నారు. అసలు ప్రభుత్వ భూమి అని తెలిసి ఉంటే అమ్మకం ఎలా జరిగింది? తెలియకపోతే కొనుగోలుదారుల పరిస్థితి ఏమిటి? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఇక్కడ ఒక పెద్ద ప్రశ్న తలెత్తుతోంది. ప్రభుత్వ భూమిని అమ్మే అధికారం ఎవరికీ లేదు. అలాంటప్పుడు విక్రయాలు ఎలా జరిగాయి? కొనుగోలుదారులు ఎందుకు నమ్మారు? మధ్యవర్తులు ఎవరు? ఈ లావాదేవీలను చూసి కూడా అధికారులు ఎందుకు మౌనం పాటించారు? ఇవన్నీ విచారణలో తేలాల్సిన అంశాలే. బద్వేలులో భూకబ్జాల చరిత్రను పరిశీలిస్తే ఒక విచిత్రమైన విధానం కనిపిస్తుందని స్థానికులు చెబుతున్నారు. మొదట ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తారు. ఆ తర్వాత కంచె వేస్తారు. తర్వాత విద్యుత్ కనెక్షన్, నీటి కనెక్షన్ తీసుకునేందుకు ప్రయత్నిస్తారు. ఆ తర్వాత పాత తేదీలతో పత్రాలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతాయి. చివరకు ప్లాట్లు చేసి విక్రయాలు మొదలవుతాయి. ఎవరైనా అభ్యంతరం చెబితే రాజకీయ ఒత్తిడి తీసుకొస్తారు. ఫిర్యాదులు ఎక్కువైతే అధికారులు వచ్చి బోర్డు పెడతారు. "ఇది ప్రభుత్వ భూమి. ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం." కానీ ఆ తర్వాత చర్యలు మాత్రం కనిపించవని స్థానికులు విమర్శిస్తున్నారు.

• కబ్జాదారుల వివాదాలతో బయటపడుతున్న భూముల అక్రమాలు

కొన్ని సందర్భాల్లో కబ్జాదారుల మధ్యే పంపకాల విషయంలో వివాదాలు తలెత్తుతాయి. అప్పుడే ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటారు. అప్పుడే అసలు కథ బయటపడుతుంది. అధికారులు హడావుడిగా వచ్చి కంచెలు వేయడం, బోర్డులు ఏర్పాటు చేయడం జరుగుతుంది. కానీ అక్రమంగా విక్రయించిన వారిపై క్రిమినల్ కేసులు, అక్రమ సంపాదనపై విచారణ, బాధ్యులపై శాఖాపరమైన చర్యలు వంటి కఠిన చర్యలు చాలా అరుదుగా కనిపిస్తాయని విమర్శలు ఉన్నాయి. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే… భూకబ్జాలకు కులం, మతం, పార్టీ అనే భేదాలు లేవని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. అధికారంలో ఎవరు ఉన్నా… ప్రతిపక్షంలో ఎవరు ఉన్నా… అవకాశం దొరికితే ప్రభుత్వ భూమి ఆక్రమించేందుకు వెనుకాడరని అంటున్నారు. మాజీ సర్పంచ్‌ల నుంచి స్థానిక నాయకుల వరకు, కొందరు ప్రజాప్రతినిధుల అనుచరుల నుంచి ప్రభావశీలుల వరకు పలువురిపై గతంలోనూ ఆరోపణలు వచ్చాయని గుర్తుచేస్తున్నారు. కొంతమంది అధికారులు కూడా బినామీల పేర్లతో ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకున్నారన్న ఆరోపణలు గతంలో వినిపించాయని స్థానికులు చెబుతున్నారు. కొందరు విచారణలు ఎదుర్కొన్నారు. కొందరిపై శాఖాపరమైన చర్యలు జరిగాయి. మరికొందరు బదిలీలతో బయటపడ్డారు. కానీ వ్యవస్థ మాత్రం మారలేదనే విమర్శ బలంగా వినిపిస్తోంది.

• భక్తి ముసుగులో సాగుతున్న సున్నితమైన భూకబ్జాలు

ఇప్పుడు దేవుడి పేరుతో జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న ఈ వ్యవహారం మరింత సున్నితమైనది. ఎందుకంటే దేవాలయం నిర్మాణం అనగానే సాధారణ ప్రజలు ప్రశ్నించడానికి వెనుకాడతారు. భక్తి భావనను ఎవరూ అవమానించాలనుకోరు. అదే బలహీనతను కొందరు అవకాశంగా మార్చుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ముందుగా చిన్న గుడి నిర్మించడం… తర్వాత మిగిలిన ప్రభుత్వ భూమిని వ్యక్తిగత ఆస్తిలా మార్చుకోవడం… చివరకు విక్రయించడం వంటి ఆరోపణలు నిజమైతే అది కేవలం భూకబ్జా మాత్రమే కాదు, భక్తుల విశ్వాసాన్ని కూడా వ్యాపార వస్తువుగా మార్చినట్టే అవుతుంది. ప్రభుత్వ భూమి అంటే అది ఒక్క శాఖది కాదు. అది ప్రజలది. ఆ భూమిపై పాఠశాల రావచ్చు. ఆసుపత్రి రావచ్చు. పార్కు రావచ్చు. పేదలకు ఇళ్లు కట్టవచ్చు. భవిష్యత్తు అవసరాల కోసం ఉపయోగించవచ్చు. అలాంటి భూమిని వ్యక్తిగత ప్రయోజనాల కోసం విక్రయించడం వల్ల నష్టం మొత్తం సమాజానికే జరుగుతుంది. ఈ ఘటనపై రెవెన్యూ శాఖ సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. సర్వే నంబర్ 728/4లో ఉన్న భూమి అసలు స్థితి ఏమిటి? ఎంత మేర ప్రభుత్వ భూమి? ఎంత మేర చెరువు పోరంబోకు? ఆలయానికి చట్టబద్ధమైన అనుమతులు ఉన్నాయా? ఎవరు ఎవరికి భూమి విక్రయించారు? ఎన్ని లావాదేవీలు జరిగాయి? అందులో అధికారుల పాత్ర ఏమైనా ఉందా? అనే అంశాలన్నింటినీ పారదర్శకంగా విచారించాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రభుత్వ భూముల రక్షణకు కఠిన చర్యలు అవసరం

దేవుడి పేరు చెప్పి ప్రభుత్వ ఆస్తులను కొల్లగొట్టే ఈ సంస్కృతి ఇలాగే సాగితే, రేపటి రోజున పాఠశాలలు, ఆసుపత్రులు, పేదల ఇళ్ల కోసం కేటాయించాల్సిన ప్రభుత్వ స్థలాలు మచ్చుకైనా మిగలవు. భక్తిని, ప్రజల సెంటిమెంట్‌ను వ్యాపార పెట్టుబడిగా మార్చుకునే కబ్జాదారుల ఆగడాలకు అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్తులో సమాజానికి తీరని ప్రమాదం పొంచి ఉంది. చట్టంపై సామాన్యుడికి నమ్మకం పోకముందే ఈ వ్యవహారంపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరపాలి. కేవలం కంచెలు వేయడం, నోటీసు బోర్డులు పెట్టడంతోనే అధికారులు తమ బాధ్యత తీరిపోయిందని అనుకుంటే లాభం లేదు. దేవుడి ముసుగులో అక్రమాలకు పాల్పడిన వారిపై, వారికి సహకరించిన సిబ్బందిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. పవిత్రమైన భక్తి భావన భూదందాకు కవచంగా మారకుండా అధికారులు గట్టి చర్యలు తీసుకున్నప్పుడే ఇలాంటి కబ్జాలకు శాశ్వత అడ్డుకట్ట పడుతుంది. అప్పుడే సమాజంలో నైతిక విలువలు నిలబడతాయి, ప్రభుత్వ భూములకు నిజమైన రక్షణ లభిస్తుంది. ప్రజలు కూడా ఇప్పుడు ఇదే కోరుకుంటున్నారు.

పోసాని మురళి, బద్వేల్ నుంచి +91 77803 20992




INDIA NON JUDICIAL
Government of Andhra Pradesh
e-Stamp

Certificate No.	IN-AP55092750045335W
Certificate Issued Date	13-Jan-2024 04:30 PM
Account Reference	NEWIMPACC (SV)/ ap18035004/ AP-CDP/ AP-BDL/apramvelu
DDO Code	27002308001 O/o IG R
Unique Doc. Reference	SUBIN-APAP18035004997887524496662W
Purchased by	VAILATI VENKATA SUMA
Description of Document	Article 0 Not Mentioned
Property Description	Not Applicable
Consideration Price (Rs.)	0 (Zero)
First Party	VAILATI VENKATA SUMA
Second Party	Not Applicable
Paid By (For Whom)	VAILATI VENKATA SUMA
Stamp Duty Amount(Rs.)	100 (One Hundred only)

1. రూ.4,00,000/-లకు స్వాధీన విక్రయ ఖరారు.
2. ది.13-01-2024 వ రెండు వేల ఇరవైనాల్గవ సంవత్సరం జనవరి నెల పదమూడవ తేదీన.

కేజీఎఫ్ కాదు జేజీఎఫ్

సీమలో సిరుల పంట

ఒకప్పుడు గోల్డ్ అంటే కేజీఎఫ్. అయితే అది నిన్నటి మాట.. జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్ జేజీఎఫ్ అనేది నేటి మాట. ఇప్పుడు దేశంలోనే రెండో అతి పెద్ద గోల్డ్ మైన్స్ ఫ్యాక్టరీగా జొన్నగిరి నిలువనుంది. ఏపీ చరిత్రలోనే కొత్త అధ్యాయానికి నాంది పలికి.. ఖనిజ రంగ చరిత్రలోనే తొలి ప్రైవేట్ బంగారం గనిగా రికార్డు సృష్టించిన జొన్నగిరి.. గేమ్‌ఛేంజర్ కానుందా..? అక్కడ లభించే బంగారంతో… రాయలసీమ రాత మారుతుందా? ఒకప్పుడు రతనాల సీమగా పేరు గాంచిన ఆ ప్రాంతం మళ్లీ సిరుల సీమగా మారుతుందా..? మనదేశంలో గోల్డ్ మైన్స్ అంటే గుర్తుకు వచ్చేది కేజీఎఫ్.. ఈ పేరుతో తీసిన సినిమా కూడా ఎన్ని రికార్డులు బద్దలు కొట్టిందో అందరికీ తెలిసిందే.. కేజీఎఫ్ కోలార్ గోల్డ్ ఫీల్డ్స్.. బంగారు నిక్షేపాల గని ఉన్న రాష్ట్రంగా వరల్డ్ వైడ్ ఫేమస్.. కానీ అదంతా గతం.. ప్రైవేటు రంగంలో స్వాతంత్రానికి పూర్వం ఏర్పాటుచేసిన కేజీఎఫ్ ప్రస్తుతం ఉనికిలో లేదు. 2000 తర్వాత కేజీఎఫ్‌లో కార్యకలాపాలు పూర్తిగా నిలిచిపోయాయి.. ఇప్పుడు ఆ స్థానంలో జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్ లైమ్‌లైట్‌లోకి వచ్చింది. దేశంలోనే రెండో అతి పెద్ద గోల్డ్ మైన్స్‌గా 'జొన్నగిరి' నిలవనుంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత నెలకొల్పిన తొలి ప్రైవేట్ మైన్స్‌గా రికార్డు సృష్టించబోతోంది. కరవు కేకలు వినిపించిన ఒకప్పటి కర్నూలు జిల్లా ఇక బంగారం ఉత్పత్తికి ప్రధాన వేదికకానుంది.

• బంగారు గనితో మారనున్న సీమ రాత

నిన్నటిదాకా కర్నూలు జిల్లాలోని జొన్నగిరిగా మాత్రమే ఉన్న ఆ ప్రాంతం… ఇప్పుడు స్వర్ణగిరిగా మారింది. జొన్నగిరి గోల్డ్ మైన్ ఒక ప్రైవేటు పెట్టుబడి మాత్రమే కాదు… ఏపీ చరిత్రలోనే కొత్త అధ్యాయానికి నాంది పలికింది. ఖనిజ రంగ చరిత్రలోనే తొలి ప్రైవేట్ బంగారం గనిగా ఆవిష్కరించింది. అక్కడ లభించే బంగారంతో… రాయలసీమ రాత మళ్లీ రతనాల సీమగా మారడం ఖాయమన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. నిజానికి జొన్నగిరి ఘనత ఎంతో ఘనమైనది, ప్రాశస్త్యమైనది.. ఈ ప్రాంతానికి ఎంతో చరిత్ర ఉంది.. మరెంతో విశిష్టత ఉంది… ఈ ప్రాంతాన్ని అప్పట్లో సువర్ణగిరి అని పిలిచేవారు. అశోకుడి నాలుగు రాజధానుల్లో ఒకటి ఇప్పటి జొన్నగిరిగా పిలవబడుతోన్న సువర్ణగిరి. వందల సంవత్సరాల క్రితమే ఈ ప్రాంతమంతా బంగారం, రత్నాలతో నిండి ఉండేది. ఇక్కడకు దగ్గరలో లభించిన అశోకుడి ఎర్రగుడి శాసనాలు ఈ ప్రాంత వైభవాన్ని చాటి చెబుతాయి. ఇక రాయలసీమ అంటేనే రతనాల సీమ అని. శ్రీకృష్ణదేవరాయుల కాలంలో సీమలో రత్నాలు రాసులుగా పోసి అమ్మేవారని మనమందరం విన్న విషయం… అయితే అదంతా గతం.. కాలక్రమంలో రాజుల సొమ్ము రాళ్ల పాలయ్యింది.. రతలసీమలో కరవు తాండవిస్తోంది.. ఇదీ నేటి కాలంలోని వాస్తవం. కానీ, ఇప్పుడు ఏపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం రాయలసీమ రూపురేఖలను మార్చేయబోతోంది.. జొన్నగిరి గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టు కేవలం బంగారం తీయడమే కాదు.. కరవు సీమను మళ్లీ రతనాల సీమగా మార్చబోతోంది..

• జొన్నగిరి బంగారు గని ప్రారంభం

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలో గల జొన్నగిరి బంగారు గనిని ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు ఘనంగా ప్రారంభించారు. ఇది భారతదేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ బంగారు గని. ప్రస్తుతం దేశంలో పనిచేస్తున్న ఏకైక ప్రైవేట్ స్వర్ణ క్షేత్రం ఇదే కావడం విశేషం. ఈ గనిని 'జియోమైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' సంస్థ సుమారు ₹405 కోట్ల పెట్టుబడితో అభివృద్ధి చేసింది. జొన్నగిరి, ఎర్రగుడి, పగడిరాయి గ్రామాల్లో దాదాపు 597.82 హెక్టార్ల విస్తీర్ణంలో ఈ ప్రాజెక్టు విస్తరించి ఉంది. ఈ జొన్నగిరి మైనింగ్ క్షేత్రం నుండి 202627 ఆర్థిక సంవత్సరంలో దాదాపు 400 కిలోల బంగారం ఉత్పత్తి అవుతుందని అంచనా వేస్తున్నారు. రాబోయే రోజుల్లో దీనిని ఏడాదికి ఒక టన్నుకు పెంచాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ భూమి పొరల్లో దాదాపు 12 టన్నుల మేర బంగారం నిల్వలు ఉన్నట్లు గుర్తించారు. మన దేశం ఏటా సుమారు 721 టన్నుల బంగారాన్ని విదేశాల నుండి దిగుమతి చేసుకుంటుంది. ఈ నేపథ్యంలో జొన్నగిరి గని దేశీయ అవసరాలకు కొంతవరకు తోడ్పడనుంది.

• స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు

దశాబ్దాల క్రితం నుంచి ఈ ప్రాంత రైతులు కేవలం వర్షాధార పంటల పైనే ఆధారపడే వారు. వర్షాలు కురవకపోతే బతుకు దెరువు కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లేవారు. ఈ నేపథ్యంలోనే కరువు కాటకాలతో అల్లాడుతున్న జొన్నగిరి ప్రాంతంలో జియో మైసూర్ గోల్డ్ మైన్స్ పరిశ్రమ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక గోల్డ్ మైన్స్ ఫ్యాక్టరీ నిర్మాణానికి అనుమతులు చకచకా వచ్చేశాయి. దీంతో గోల్డ్ మైన్స్ ఫ్యాక్టరీ యాజమాన్యం పరిశ్రమను స్థాపించి బంగారు శుద్ధి ప్రక్రియను మొదలు పెట్టింది. బంగారు శుద్ధి ట్రయల్ రన్ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. ఈ స్వర్ణ ప్రాజెక్టు ద్వారా స్థానికంగా 300 మందికి ప్రత్యక్షంగా, మరో 300 మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. ఈ ప్రాంత ప్రజలకు తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి మైనింగ్ సంస్థ నిధులను ఖర్చు చేస్తుంది. హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ నుండి 18 కిలోమీటర్ల పైప్‌లైన్ ద్వారా ఈ పరిశ్రమకు నీటిని తరలిస్తున్నారు.

• బంగారం వెలికితీసే విధానం

జొన్నగిరి గనిలో ఓపెన్‌పిట్ మైనింగ్ పద్ధతి ద్వారా బంగారాన్ని వెలికితీస్తున్నారు. భూమిలో ఉన్న ఖనిజాన్ని తవ్వి, పేల్చి, ముక్కలుగా చేసి ప్లాంట్‌కు తరలిస్తారు. అక్కడ ప్రత్యేక సాంకేతికత, సైనైడ్ ప్రక్రియ ద్వారా బంగారం ముడి ముక్కలను వేరు చేస్తారు. ఆ తర్వాత వాటిని కరిగించి పెద్ద బిస్కెట్లుగా మారుస్తారు. ఈ ప్లాంట్ నిర్వహణకు అవసరమైన నీటిని హంద్రీనీవా సుజల స్రవంతి కాలువ నుండి 18 కిలోమీటర్ల పైప్‌లైన్ ద్వారా తెప్పించుకుంటున్నారు. ఈ మైనింగ్ ప్రాంతంలో ఉన్న ధార్వార్ శిలలు గతంలో ప్రసిద్ధి చెందిన కోలార్, హట్టి గనుల తరహాలోనే ఉంటాయి. జొన్నగిరి భూగర్భంలో ఇంకా ఎక్కువ మొత్తంలో నిల్వలు ఉండే అవకాశం ఉందని అన్వేషణలో తేలింది. ఈ ప్రాంతానికి బంగారు భవిష్యత్తు తీసుకురావాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జొన్నగిరి గ్రామం పేరును 'స్వర్ణగిరి'గా మారుస్తున్నట్లు ప్రకటించారు. ఈ ప్రాజెక్టు ఏపీ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేయనుంది.

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- **ఏరువాక పౌర్ణమి వేడుకల్లో ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య**
- **రైతులతో కలిసి భూమి పూజ**
- **అన్నదాతకు 'కూటమి' అండ**
- **సకాలంలో విత్తనాలు, ఎరువుల పంపిణీ**

చీరాల, జూన్ 29(నాదేశం): రైతాంగానికి అత్యంత పవిత్రమైన ఏరువాక పౌర్ణమి వేడుకలు చీరాల నియోజకవర్గంలో వైభవంగా జరిగాయి. స్థానిక శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య వేటపాలెం మండలం పందిళ్ళపల్లి లో రైతులు ఏర్పాటు చేసిన ఏరువాక పౌర్ణమ పూజలో పాల్గొన్నారు. మొదట శ్రీ పందిళ్లమ్మ తల్లి దేవస్థానాన్ని సందర్శించి అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాతలతో కలిసి భూమి పూజ కార్యక్రమాన్ని ప్రారంభించి దుక్కి దున్నారు.
అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాలకొండయ్య మాట్లాడుతూ.. జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి నాడు నేలతల్లికి నమస్కరించి, ఎడ్లను అలంకరించి కొత్త సాగు పనులకు శ్రీకారం చుట్టడం తెలుగు సంప్రదాయంలో ఒక విశిష్టమైన ఆచారమని అన్నారు. తొలకరి జల్లులతో నేల పదునెక్కిన వేళ, ఎడ్లకు పూజలు చేసి నాగలితో పొలంలో తొలి దుక్కిని ప్రారంభించడం మన పూర్వీకుల నుంచి వస్తున్న సాంప్రదాయమని పేర్కొన్నారు. ఇది వ్యవసాయానికి, పశుసంపదకు ఉన్న విడదీయరాని బంధాన్ని తెలియజేస్తుందన్నారు. సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండి రైతుల ఇళ్లు సిరిసంపదలతో కళకళలాడాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రైతుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని, ఇప్పటికే తొలి విడత పీఎంకిసాన్ - అన్నదాత సుఖీభవ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసి తమ నిబద్ధతను నిరూపించుకున్నామని గుర్తుచేశారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సకాలంలో అందించేందుకు, సాగు కాలంలో ఎదురయ్యే సమస్యలను అధిక శ్రద్ధతో పరిష్కరించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.
సాగునీటి సౌకర్యాలను మెరుగుపరచడం, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు రైతులకు అవసరమైన రుణ సదుపాయాలను సులభతరం చేయడంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే తెలిపారు. రాబోయే రోజుల్లో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేసి రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్ధన్, పందిళ్ళపల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు బాలచంద్ర, చీరాల నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు పోలకం చంద్రశేఖర్, పందిళ్ళపల్లి పీఏసీఎస్ అధ్యక్షులు శ్రీనివాసరావు, చీరాల మండల అధ్యక్షులు గంజి పురుషోత్తం, తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

మంగళగిరిలో ఘనంగా దేవల మహర్షి జయంతి

మంగళగిరి పట్టణంలో దేవాంగ వంశ మూల పురుషుడు దేవల మహర్షి స్వామివారి జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. శ్రీ అమరావతి దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సొంత స్థలంలో ఈ వేడుకలు చేసుకోవడం ఎంతో ఆనందాన్ని ఇస్తోందని సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ పూజా కార్యక్రమాల్లో దేవాంగ ప్రముఖులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని దేవల మహర్షికి, అమ్మ చౌడేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు చేశారు.

మంత్రి లోకేశ్ చొరవ

దేవాంగ సామాజిక వర్గం ఎన్నో ఏళ్లుగా కమ్యూనిటీ హాలు ఏర్పాటు కోసం ఎదురుచూస్తోంది. ఈ విషయాన్ని గుర్తించిన స్థానిక శాసనసభ్యుడు, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. లక్ష్మీనరసింహ కాలనీలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించారు. లోకేశ్ చేసిన ఈ సాయం వల్లనే ఈరోజు తమ సొంత స్థలంలో పండుగ చేసుకోగలుగుతున్నామని అమరావతి దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బల్ల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి అల్లక తాతారావు, కోశాధికారి అల్లక నమశ్శివాయ, కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం మంగళగిరిలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దేవాంగులందరికీ ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు.

భవన నిర్మాణానికి విజ్ఞప్తి

కార్యక్రమంలో ముఖ్య అతిథి డాక్టర్ సజ్జా హేమలత మాట్లాడుతూ మంత్రి నారా లోకేశ్ దేవాంగులను, చేనేత కార్మికులను దత్తత తీసుకున్నారని చెప్పారు. అందువల్లనే మంగళగిరి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు. ఎన్నో ఏళ్ల కల అయిన స్థల కేటాయింపును లోకేశ్ హయాంలోనే సాధించుకోవడం చారిత్రాత్మక విషయమని కొనియాడారు. భవిష్యత్తులో ఈ స్థలంలో దేవాంగ కమ్యూనిటీ హాలు భవన నిర్మాణానికి కూడా మంత్రి లోకేశ్ ఆర్థికంగా, సాంకేతికంగా తోడ్పాటునందించాలని సంఘ ప్రతినిధులు కోరారు. దేవల మహర్షి జయంతి సందర్భంగా సుమారు రెండు వందల మంది నిరుపేద దేవాంగ కులస్థులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు.

తిరుమలలో వైభవంగా పౌర్ణమి గరుడసేవ

- **గరుడవాహనంపై భక్తులకు శ్రీవారి దర్శనం**

తిరుమల శ్రీవారి ఆలయంలో సోమవారం రాత్రి పౌర్ణమి గరుడసేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. సర్వాలంకార భూషితుడైన శ్రీ మలయప్ప స్వామివారు గరుడవాహనంపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ వేలాది మంది భక్తులకు దివ్య దర్శనం ఇచ్చారు. గోవింద నామస్మరణల మధ్య సాగిన ఈ ఉత్సవంలో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొని స్వామివారి కటాక్షం పొందారు. ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి. వైష్ణవ సంప్రదాయంలో గరుడసేవకు విశేష ప్రాధాన్యం ఉంది. గరుడవాహనంపై శ్రీవారి దర్శనం పొందితే సర్వపాపాలు తొలగి జ్ఞానవైరాగ్యాలు సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం. గరుడుడు భక్తి, సమర్పణకు ప్రతీకగా భావిస్తారు. ఈ వేడుకలో టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు శాంతారామ్, పనబాక లక్ష్మి, జానకీ దేవి, డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు. విశేష సంఖ్యలో భక్తులు హాజరై గరుడవాహనంపై విహరించిన శ్రీ మలయప్పస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విశ్వనగర నిర్మాణంలో సర్కారు దూకుడు

- **దేశం మెచ్చే రాజధానిగా అమరావతి**
- **హైదరాబాద్‌ను మించిన సరికొత్త వ్యూహం**

అమరావతిని యావత్ దేశం గర్వించే అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. హైదరాబాద్ నగరానికి ఒక అడుగు ముందే ఉండేలా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అమరావతి నిర్మాణం జరగాలని అధికారులను ఆదేశించారు. సచివాలయంలో ప్రముఖ నిర్మాణ సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో ఆయన మాట్లాడారు. ఈ చారిత్రాత్మక నగర నిర్మాణంలో భాగస్వాములు కావడం కాంట్రాక్టు సంస్థలకు దక్కిన గొప్ప గౌరవంగా భావించి, పనుల్లో వేగం పెంచాలని పిలుపునిచ్చారు.

భారీ నిధులు... శరవేగంగా ఐకానిక్ భవనాలు

ప్రస్తుతం రాజధాని ప్రాంతంలో 50,999 రూపాయల విలువైన పనులు వివిధ దశల్లో సాగుతున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అసెంబ్లీ, హైకోర్టు, సచివాలయ టవర్ల వంటి ఐకానిక్ భవనాలతో పాటు హౌసింగ్, ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పనులు వేగవంతం అయ్యాయి. పనులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ముందస్తుగా మానవ వనరులను, భారీ యంత్రాలను సిద్ధం చేసుకోవాలని సీఎం సూచించారు. ప్రస్తుతం ఇరవై ఆరు వేల మందికి పైగా కార్మికులు, ఐదు వేల భారీ యంత్రాలు ఇక్కడ రాత్రింబవళ్లు శ్రమిస్తున్నట్లు మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ వెల్లడించారు. భవిష్యత్తులో వరద ముప్పు లేకుండా కొండవీటి వాగు, పాలవాగు ప్రవాహాలను వెడల్పు చేస్తున్నట్లు తెలిపారు.

అడ్డంకులు దాటుకుంటూ అద్భుత ప్రగతి

కొందరు వ్యక్తులు కావాలనే కోర్టు కేసులు, లిటిగేషన్లతో రాజధాని నిర్మాణాన్ని అడ్డుకోవాలని చూస్తున్నారని చంద్రబాబు మండిపడ్డారు. ప్రజా ప్రయోజనాలే పరమావధిగా ఇలాంటి శక్తులను తిప్పికొడుతూ ముందుకు సాగుతామన్నారు. గత పాలకులు ఐదేళ్ల పాటు ఈ ప్రాజెక్టును పూర్తిగా పక్కనబెట్టేసి విధ్వంసం సృష్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. గడచిన రెండేళ్లుగా అమరావతి నిర్మాణాన్ని మళ్లీ పూర్తిస్థాయిలో గాడిలో పెట్టామని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా వివిధ పుణ్యక్షేత్రాలు, నదుల నుండి తెచ్చిన పవిత్రమైన మట్టి, నీటితో పునీతమైన ఈ నేలపై అత్యుత్తమ నివాసయోగ్య నగరం రూపుదిద్దుకుంటోందని చెప్పారు.

పెట్టుబడుల వేటలో నయా ట్రెండ్

(మొదటి పేజీ తరువాయి..)

నవంబర్ 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో ఈ ప్రతిష్ఠాత్మక సదస్సు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సారి సదస్సును ప్రత్యేకమైన థీమ్‌తో ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రధాన సదస్సుకు ముందే రాజమండ్రి, కాకినాడ, అమరావతి, అనంతపురం, తిరుపతి వంటి నగరాల్లో ప్రాంతీయ సదస్సులు నిర్వహించి స్థానిక వ్యాపారవేత్తలను అనుసంధానం చేయాలని భావిస్తున్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ప్రభుత్వాలు, పరిశ్రమల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక బిజినెస్ సమావేశాలు ఏర్పాటు చేయనున్నారు.

దేశవ్యాప్తంగా ప్రచార పర్వం

ఈ సదస్సుకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చేందుకు జూలై నుండి సెప్టెంబర్ వరకు దేశీయ, అంతర్జాతీయ నగరాల్లో భారీగా రోడ్ షోలు నిర్వహించనున్నారు. ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, ముంబై, హైదరాబాద్ వంటి ప్రముఖ నగరాల్లో ఈ ప్రచార కార్యక్రమాలు సాగుతాయి. ఈ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో రాష్ట్ర మంత్రులు టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, నారాయణ, కందుల దుర్గేష్, గొట్టిపాటి రవికుమార్‌తో పాటు సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజీత్ బెనర్జీ పాల్గొన్నారు. ఏపీని పెట్టుబడుల స్వర్గధామంగా మార్చడమే లక్ష్యంగా యంత్రాంగం కదులుతోంది.

ప్రియుడికి కోటి నజరానా

పెళ్లి షాపింగ్ పేరిట కోటి కొల్లగొట్టిన సియా

పుణెకు చెందిన రియల్టర్ కేతన్ అగర్వాల్ జీవితంలో పెళ్లి పీటలు ఎక్కాల్సిన సమయం అది. తన కాబోయే భార్య సియా గోయల్ షాపింగ్ కోసమని అడగ్గానే ఏకంగా కోటి రూపాయల నగదు చేతిలో పెట్టాడు. నమ్మకమే పెట్టుబడిగా సాగిన ఈ బంధంలో ఆ వధువు చేసిన పని వింటే ఎవరికైనా మైండ్ బ్లాక్ అవ్వాల్సిందే. ఆ కోటి రూపాయలను పెళ్లి ఖర్చులకు వాడకుండా, తన సీక్రెట్ ప్రియుడు చేతన్ చౌదరి వ్యాపార స్థిరత్వం కోసం గుట్టుచప్పుడు కాకుండా అప్పగించేసింది. ఆర్థికంగా వెనుకబడిన ప్రియుడిని ఎలాగైనా లైఫ్ లో సెటిల్ చేయాలనేది ఆ కిలాడీ ప్లాన్.

దారుణమైన వ్యూహం: మూడేళ్ల తర్వాత పెళ్లి స్కెచ్

కేతన్‌ను వదిలించుకుంటేనే తాము హాయిగా బ్రతకగలమని ఆ జంట ఒక భయంకరమైన పథకం రచించింది. కేతన్ హత్య జరిగిన తర్వాత ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు సియా గోయల్ మూడేళ్ల పాటు పెళ్లి చేసుకోకుండా ఇంట్లోనే ఉండాలని నిర్ణయించుకుంది. ఈ లోగా చేతన్ ఆ కోటి రూపాయలతో వ్యాపారంలో బాగా స్థిరపడతాడని, జనాలు కూడా ఈ విషయాన్ని మర్చిపోతారని భావించారు. ఆ తర్వాత ఇద్దరూ పెళ్లి చేసుకుని సమాజంలో పెద్ద మనుషులుగా చలామణి అవ్వాలని ఒక పక్కా టైమ్‌లైన్ గీసుకున్నారు.

సిగ్నల్ కోడ్: కూర్చుంటే ప్రాణం పోయినట్లే

జూన్ 18న పూణెలోని లోహగడ్ కోటపై కేతన్‌ను హత్య చేసేందుకు వారు వాడిన సిగ్నల్ కోడ్ వింటే ఆశ్చర్యం కలుగుతుంది. కోటపై నడుస్తున్నప్పుడు సియా నీళ్లు తాగడానికో లేక షూ లేస్ కట్టుకోవడానికో కిందకు కూర్చోవాలి, అదే చేతన్‌కు సిగ్నల్. సియా కిందకు కూర్చోవడం వెనుక ఒక స్వార్థపూరిత కారణం ఉంది. చేతన్ కేతన్‌ను లోయలోకి నెట్టేసేటప్పుడు, కేతన్ ప్రాణభయంతో సియాను పట్టుకుంటే ఆమె కూడా కింద పడిపోతుందని భయపడ్డారు. అందుకే ఆమె రక్షణ కోసం కింద కూర్చోవాలనే ప్లాన్ వేశారు.

విఫలమైన మొదటి ప్రయత్నం: పాము కథతో డ్రామాలు

అంతకుముందు జూన్ 14న కూడా వారు కేతన్‌ను నెట్టేయడానికి ప్రయత్నించారు. అయితే కేతన్ అదృష్టవశాత్తూ ఒక పొదను పట్టుకుని ప్రాణాలు కాపాడుకున్నాడు. ఆ సమయంలో సియా ఏమాత్రం కంగారు పడకుండా అక్కడ పాము వచ్చిందని, భయంతో పొరపాటున చేయి తగిలిందని ఒక పెద్ద కథ అల్లి నమ్మించింది. రెండోసారి మాత్రం ఎలాగైనా పని ముగించాలని చేతన్ స్వయంగా ఒక స్కూటర్‌పై తొంభై కిలోమీటర్లు ప్రయాణించి కోట వద్దకు వచ్చాడు. టోల్ ప్లాజా వద్ద కారు దొరికిపోతుందనే భయంతో స్కూటర్ వాడటం గమనార్హం.

సీక్రెట్ కాల్: 34 నిమిషాల్లో ముగిసిన కథ

హత్య జరగడానికి సరిగ్గా ముప్పై నాలుగు నిమిషాల ముందు సియా తన ప్రియుడికి ఒక సీక్రెట్ కాల్ చేసింది. అదే వారి ఆఖరి ప్లాన్ అమలుకు గ్రీన్ సిగ్నల్. ఆ తర్వాత అనుకున్నట్లుగానే కేతన్‌ను లోయలోకి నెట్టి చంపేశారు. పోలీసులు రంగంలోకి దిగి కాల్ డేటా రికార్డులను పరిశీలించడంతో అసలు నిజాలు బయటపడ్డారు. ప్రస్తుతం ఈ కిలాడీ జంట జైలు పాలైంది. ప్రేమ పేరిట నమ్మకద్రోహానికి పాల్పడితే జీవితాలు ఎలా నాశనం అవుతాయో చెప్పడానికి ఈ ఘటనే ఒక పెద్ద ఉదాహరణ.

కిలాడీ ప్లాన్ లీక్

- **పాస్‌పోర్ట్ దహనం వెనుక రహస్యం!**
- **నిందితులకు కస్టడీ పొడిగింపు**
- **పక్కా సాక్ష్యాలతో పోలీసుల వాదన**

పూణె లోహగడ్ కోటపై జరిగిన కేతన్ అగర్వాల్ హత్య కేసులో నిందితులు సియా గోయల్, చేతన్ చౌదరిల పోలీస్ కస్టడీని కోర్టు మరో ఐదు రోజులు పొడిగించింది. నిందితుల మునుపటి కస్టడీ గడువు ముగియడంతో పోలీసులు వారిని వడ్గావ్ మావల్ కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ దారుణ హత్యకు సంబంధించి ఇంకా అనేక కీలక ఆధారాలు సేకరించాల్సి ఉందని పోలీసులు న్యాయస్థానానికి వివరించారు. ఈ ఘోరకలి వెనుక ఉన్న పూర్తి నిజాలను వెలుగులోకి తెచ్చేందుకు నిందితులను మరింత లోతుగా విచారించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

నిజాలు తగులబెట్టిన సియా: బూడిదైన పాస్‌పోర్ట్

విచారణలో భాగంగా పోలీసులు కోర్టుకు ఒక దిగ్భ్రాంతికరమైన విషయాన్ని వెల్లడించారు. హత్యకు ముందే కేతన్ పాస్‌పోర్ట్‌ను సియా గోయల్ ముక్కలుగా చింపి, ఆపై పూర్తిగా తగులబెట్టేసిందని వారు తెలిపారు. సాక్ష్యాలను మాయం చేసేందుకు ఆమె చేసిన ఈ ప్రయత్నానికి సంబంధించిన అవశేషాలను రికవరీ చేయాల్సి ఉందని చెప్పారు. అలాగే హత్య చేసిన తర్వాత చేతన్ తన బట్టలు మార్చుకున్నాడని, ఆ తర్వాత అతను ఎక్కడెక్కడ తిరిగాడనే విషయాలను గుర్తించాల్సి ఉందన్నారు. నిందితులు ఇద్దరూ ఫోన్లలో మాట్లాడుకున్న కాల్ డేటా వివరాలపై కూడా విచారణ సాగుతోంది.

కోటపై డమ్మీతో సీన్ రీక్రియేషన్: గుట్టు రట్టు

కోర్టు విచారణకు ఒక రోజు ముందే పోలీసులు నిందితులు ఇద్దరినీ లోహగడ్ కోటకు తీసుకెళ్లారు. భద్రతా కారణాల దృష్ట్యా సాధారణ పర్యాటకులను నిలిపివేసి, అక్కడ ఒక డమ్మీ బొమ్మతో క్రైమ్ సీన్‌ను రీక్రియేషన్ చేశారు. కేతన్‌ను వందల అడుగుల లోతు గల లోయలోకి ఎలా నెట్టేశారు అనే విషయాలను ప్రాక్టికల్‌గా పరిశీలించారు. మొదట ఈ మరణాన్ని ప్రమాదంగా చిత్రీకరించేందుకు సియా ప్రయత్నించినప్పటికీ, పోలీసుల నిశిత విచారణలో అది పక్కా ప్లాన్ ప్రకారం జరిగిన హత్యేనని తేలిపోయింది. ప్రియుడితో కలిసి జీవించాలనే స్వార్థంతో సాగించిన ఈ నమ్మకద్రోహం ఇప్పుడు వారిని జైలు పాలు చేసింది.

ధర్మ రక్షణ ముసుగులో అపచారం

- **నిర్లక్ష్యానికి పరాకాష్ట: భూమన విమర్శలు**

తిరుపతి అలిపిరి సమీపంలోని టీటీడీ స్థలాల్లో శ్రీ వేంకటేశ్వరస్వామి చిత్రపటాలు అత్యంత నిర్లక్ష్యంగా పడివుండటం తీవ్ర దుమారం రేపుతోంది. పవిత్రంగా ఉండాల్సిన ఆధ్యాత్మిక ప్రాంతాలు చెత్తకుప్పలను తలపిస్తున్నాయని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. టీటీడీ విజిలెన్స్ వ్యవస్థ పూర్తిగా నిద్రపోతోందని, ఇంతటి ఘోర అపచారం జరుగుతున్నా ఈవో, పాలకమండలి చైర్మన్ బీఆర్ నాయుడు స్పందించకపోవడం సిగ్గుచేటని భూమన విమర్శించారు.
ప్రక్షాళన పేరుతో గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం వాస్తవ పరిస్థితులను గాలికొదిలేసిందని ఆరోపించారు. ఈ దారుణ పరిస్థితికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నైతిక బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సనాతన ధర్మం, హిందూ సంప్రదాయాల పరిరక్షణ గురించి నిత్యం మాట్లాడే ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి భూమన ఘాటు వ్యాఖ్యలు చేశారు. "పవనానంద స్వామి.. మీ సనాతన ధర్మం ఎలా ఉందో ఓసారి వచ్చి చూడండి" అంటూ ఎద్దేవా చేశారు. స్వామివారి చిత్రపటాలకు తగిన గౌరవం కల్పించేలా వెంటనే చర్యలు చేపట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



డ్వాక్రా మహిళలకు తీరని అన్యాయం

- **హామీల అమలులో మోసం : బుగ్గన ఆగ్రహం**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు అబద్ధాలు చెబుతోందని మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ విమర్శించారు. డ్వాక్రా మహిళల వడ్డీ రాయితీపై వైయస్ జగన్ లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందన్నారు. గత వైయస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మహిళల సాధికారత కోసం వడ్డీ రాయితీ కింద వేల కోట్ల రూపాయలు నేరుగా వారి ఖాతాల్లో జమ చేశామని బుగ్గన స్పష్టం చేశారు.

ఎన్నికల మాటలు ఏమాయ్యాయి?

స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల పరిమితిని పది లక్షల వరకు పెంచుతామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చి ఓట్లు అడిగిన కూటమి నేతలు ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నా ఇప్పటివరకు వడ్డీ రాయితీ కింద ఒక్క రూపాయి కూడా విడుదల చేయకుండా లక్షలాది మంది మహిళలను మోసం చేశారని ఆరోపించారు. కూటమి పాలనలో బ్యాంకుల రుణాల వృద్ధి కూడా పూర్తిగా తగ్గుముఖం పట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆర్థిక సంక్షోభంలో రాష్ట్రం

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోందని బుగ్గన ఆందోళన వ్యక్తం చేశారు. సొంత పన్నుల ఆదాయంలో ప్రతికూల వృద్ధి నమోదు కావడం ఇందుకు నిదర్శనమన్నారు. జగన్ అడిగిన ప్రశ్నలపై బహిరంగ చర్చకు వచ్చే ధైర్యం ప్రభుత్వానికి ఉందా అని సవాల్ విసిరారు. ఇప్పటికైనా అబద్ధాల ప్రచారాలు మానేసి, డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

లాకప్ డెత్ కేసులో విచారణ వాయిదా

- **సీఐ నాగరాజు కస్టడీపై కోర్టు నిర్ణయం**

సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను హైకోర్టు రెండు వారాల పాటు వాయిదా వేసింది. అలాగే ప్రధాన నిందితుడైన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజును పోలీస్ కస్టడీకి ఇవ్వాలంటూ సిట్ దాఖలు చేసిన పిటిషన్ విచారణను జూలై 1కి కోర్టు మార్చింది. సంచలన కేసుకు సంబంధించి విజయవాడలోని ఏజేఎమ్ కోర్టులో సోమవారం రెండు ముఖ్యమైన పిటిషన్లపై విచారణ జరిగింది. ఈ కేసులో మరిన్ని కీలక వివరాలను సేకరించడం కోసం సీఐ నాగరాజును తమ కస్టడీకి ఇవ్వాలని సిట్ అధికారులు న్యాయస్థానాన్ని కోరారు. 12 రోజుల పాటు సీఐని తమ కస్టడీకి ఇస్తే పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిజాలు బయటకు తీస్తామని కోర్టుకు వివరించారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం.. కౌంటర్ దాఖలు చేయాలని సీఐ తరఫు న్యాయవాదిని ఆదేశిస్తూ తదుపరి విచారణను జూలై 1వ తేదీకి వాయిదా వేసింది.

ఇంటి భోజనానికి అనుమతి

ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా శిక్ష అనుభవిస్తున్న సీఐ నాగరాజు కోర్టులో మరో పిటిషన్ దాఖలు చేశారు. తన ఆరోగ్య కారణాల దృష్ట్యా జైలు ఆహారం పడదని, అందువల్ల ఇంటి నుండి భోజనం తెప్పించుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఆయన న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. ఈ విజ్ఞప్తిని పరిశీలించిన కోర్టు సానుకూలంగా స్పందించింది. సీఐ నాగరాజుకు జైలు నిబంధనల ప్రకారం ఇంటి నుండి భోజనాన్ని తెప్పించుకునేందుకు అనుమతులు ఇస్తూ తగిన ఆదేశాలు జారీ చేసింది.

ఉద్యోగం కోసం వెతుకులాట

- భారత్‌ను వణికించిన ఐర్లాండ్ బౌలర్
- మైదానంలో టీమిండియాను దెబ్బకొట్టిన జై

భారత్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో ఐర్లాండ్ ఫాస్ట్ బౌలర్ జై ముంద్రా అద్భుత ప్రదర్శన చేశాడు. రెండు మ్యాచ్‌లలో మొత్తం ఐదు వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డును గెలుచుకున్నాడు. ముఖ్యంగా రెండవ టీ20 మ్యాచ్‌లో భారత ఓపెనర్లు సంజూ శాంసన్, అభిషేక్ శర్మలను వరుసగా సున్నా పరుగులకే అవుట్ చేసి షాక్ ఇచ్చాడు. ఆ తర్వాత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌ను కూడా పది పరుగులకే పెవిలియన్‌కు పంపాడు. ఇతని అద్భుతమైన బౌలింగ్ దాటికి భారత బ్యాటర్లు ఎవరూ సమాధానం చెప్పలేకపోయారు.

• లింక్డ్ఇన్ ప్రొఫైల్ వైరల్ కావడం

మైదానంలో అంతటి సంచలనం సృష్టించిన ఈ బౌలర్ నిజజీవితంలో మాత్రం ప్రస్తుతం ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నాడు. దానికి సంబంధించిన వివరాలు అతని లింక్డ్ఇన్ సోషల్ మీడియా ఖాతాలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. దాంతో అతని ప్రొఫైల్ నెట్టింట బాగా వైరల్ అయింది. అంతర్జాతీయ స్థాయిలో ప్రపంచ ఛాంపియన్లను వణికించిన ఒక అగ్రశ్రేణి ఆటగాడు సాధారణ ఉద్యోగం కోసం వెతుకుతుండటం చూసి క్రీడా ప్రపంచం ఆశ్చర్యపోతోంది.

• భారతదేశంతో ఉన్న పాత బంధం

రాజస్థాన్‌లో జన్మించిన జై ముంద్రా ఉన్నత చదువుల కోసం 2021 సంవత్సరంలో ఐర్లాండ్ వెళ్లాడు. అక్కడ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగంలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశాడు. ఐర్లాండ్ జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ అతను ఇప్పటికీ భారతీయ పాస్‌పోర్టునే కలిగి ఉన్నాడు. చదువు పూర్తయిన తర్వాత ఇంటెల్ సంస్థలో ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ ఇంజనీర్‌గా పనిచేశాడు. అయితే 2025 జూన్ నెలలో ఆ ఉద్యోగం వదిలేసిన తర్వాత కొత్త అవకాశం దొరకలేదు.

• యూరప్‌లో కొత్త కొలువు కోసం వేట

ప్రస్తుతం 29 ఏళ్ల వయసున్న జై ముంద్రా తన ప్రొఫైల్‌లో ఓపెన్ టు వర్క్ అనే ట్యాగ్ పెట్టుకున్నాడు. ఐర్లాండ్ లేదా యూరప్ దేశాలలో ఇంజనీరింగ్ రంగంలో పూర్తిస్థాయి ఉద్యోగం సంపాదించాలని చూస్తున్నాడు. కొన్ని నెలల క్రితం వరకు కేవలం ఉద్యోగ ప్రకటనలపై స్పందించిన ఒక సాధారణ టెక్నీషియన్, ఈ రోజు ప్రపంచ అత్యుత్తమ క్రికెట్ జట్టును ఓడించి చరిత్ర సృష్టించాడు. అతని ప్రతిభకు క్రీడాభిమానులు నీరాజనాలు పలుకుతున్నారు.

వైభవ్ సూర్యవంశీపై కోచ్ స్పష్టత

ఐర్లాండ్ సిరీస్‌లో ఎందుకు ఆడలేదంటే!?

భారత యువ క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ క్రికెట్ ఆడటానికి పూర్తి అర్హత సాధించాడని సహాయక కోచ్ ర్యాన్ టెన్ డోస్చాట్ తెలిపారు. అయితే జట్టులో చోటు దక్కించుకోవడానికి ప్రతి ఆటగాడు ఒక నిర్దిష్ట ప్రక్రియను దాటాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఐర్లాండ్ పర్యటనలో ఈ 15 ఏళ్ల యువ బ్యాటర్‌కు తుది జట్టులో అవకాశం ఇవ్వకపోవడంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఐర్లాండ్ చేతిలో భారత్ టీ20 సిరీస్‌ను 02తో కోల్పోవడంతో ఈ చర్చ మరింత తీవ్రమైంది. ప్రపంచకప్ గెలవడంలో కీలక పాత్ర పోషించిన సంజూ శాంసన్ వంటి ఆటగాళ్లకు వరుస అవకాశాలు ఇచ్చి వారిలో ఆత్మవిశ్వాసం నింపడం చాలా ముఖ్యమని కోచ్ వివరించారు. ఐపీఎల్‌లో అద్భుతంగా రాణించిన ఆటగాళ్లను జట్టులోకి తీసుకున్నప్పటికీ, వారికి తగిన సమయం ఇవ్వాలని యాజమాన్యం భావిస్తోంది. వైభవ్ ప్రతిభపై ఎటువంటి సందేహాలు లేవని, సరైన సమయం వచ్చినప్పుడు అతను తప్పకుండా బరిలోకి దిగుతాడని బ్యాటింగ్ కోచ్ సితాంశు కోటక్ కూడా ఇదివరకే స్పష్టం చేశారు. భారత జట్టు తదుపరి పర్యటన కోసం ఇంగ్లాండ్ వెళ్లనుంది. జూలై 1 నుండి ఇంగ్లాండ్‌తో టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. ఈ పర్యటనలో వైభవ్ మైదానంలోకి అడుగుపెడితే, భారతదేశం తరఫున అత్యంత పిన్న వయసులో అంతర్జాతీయ క్రికెట్ ఆడిన ఆటగాడిగా రికార్డు సృష్టిస్తాడు. గతంలో 16 ఏళ్ల వయసులో అరంగేట్రం చేసిన సచిన్ టెండూల్కర్ రికార్డును వైభవ్ బద్దలు కొట్టే అవకాశం ఉంది. అభిమానులు ఈ చారిత్రాత్మక క్షణం కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

ఇంత చెత్త రికార్డా?

- గంభీర్‌పై వెల్లువెత్తిన ఆగ్రహం
- కోచ్ వ్యూహాలపై విమర్శల వర్షం
- ఈ కోచ్ మాకు వద్దన్న ఐస్‌లాండ్

ఐర్లాండ్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భారత జట్టు ఘోరంగా ఓడిపోయింది. ఈ ఘోర ఓటమి తర్వాత భారత ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ తీవ్ర విమర్శల పాలు కావలసివస్తోంది. ప్రపంచ ఛాంపియన్లుగా బరిలోకి దిగిన భారత్ ఈ సిరీస్‌ను 02తో పూర్తిగా కోల్పోవడం అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది. శ్రేయస్ అయ్యర్‌ను కెప్టెన్‌గా నియమించడం, జట్టు ఎంపికలో గంభీర్ తీసుకున్న నిర్ణయాలు ఇప్పుడు వివాదాస్పదంగా మారాయి. విమర్శకులు కోచ్ వ్యూహాలను తీవ్రంగా తప్పుబడుతున్నారు.

ఐస్‌లాండ్ క్రికెట్ ఎగతాళి

ఈ దారుణ ఓటమిపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. ఐస్‌లాండ్ క్రికెట్ బోర్డు గంభీర్ కోచింగ్ శైలిని వినూత్నంగా ఎగతాళి చేసింది. తమ జట్టుకు గంభీర్‌ను కోచ్‌గా నియమించుకునే ఉద్దేశం అస్సలు లేదని వారు ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. అంతటి ప్రతిభావంతులైన భారత ఆటగాళ్లను పెట్టుకుని ఐర్లాండ్ లాంటి పిచ్‌లపై ఇలాంటి దారుణ ఫలితాలు సాధించడం ఒక వింతేనంటూ వారు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ పోస్ట్ నెట్టింట బాగా వైరల్ అయింది.

సంజయ్ మంజ్రేకర్ సాంకేతిక విమర్శలు

భారత మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ సైతం గంభీర్ వ్యూహాత్మక లోపాలను ఎండగట్టారు. జట్టులో ఎక్కువ మంది ఆల్‌రౌండర్లను నింపడం కంటే నమ్మకమైన మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు ఉండటం చాలా అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. గంభీర్ హయాంలో ఆల్‌రౌండర్ల సంఖ్య మితిమీరిపోయిందని, ఇది జట్టు సమతుల్యతను దెబ్బతీస్తోందని మంజ్రేకర్ స్పష్టం చేశారు. విదేశీ పిచ్‌లపై రాణించాలంటే సాంకేతిక పరిజ్ఞానం ఉన్న శుభ్‌మన్ గిల్ లాంటి ఆటగాళ్లను తిరిగి టీ20ల్లోకి తీసుకురావాలని మంజ్రేకర్ సూచించారు.

వైజాగ్ వేదికగా నేడు లెనిన్ ట్రైలర్ విడుదల

అక్కినేని అఖిల్ అభిమానులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మాస్ కంబ్యాక్ మూవీ 'లెనిన' ఇప్పుడు ప్రమోషన్స్‌లో వేగం పెంచింది. దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరు తెరకెక్కిస్తున్న ఈ మాస్ యాక్షన్ డ్రామాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొనగా, తాజాగా ట్రైలర్ లాంచ్‌కు సంబంధించిన అప్‌డేట్ సినిమాపై మరింత హైప్‌ను పెంచుతోంది. చిత్ర బృందం 'లెనిన' థియేట్రికల్ ట్రైలర్‌ను జూన్ 30న విశాఖపట్నంలో గ్రాండ్‌గా విడుదల చేయాలని నిర్ణయించింది. సాయంత్రం 4 గంటలకు నగరంలోని ప్రముఖ శరత్ థియేటర్‌లో ఈ ఈవెంట్ జరగనుంది. ట్రైలర్ లాంచ్ కోసం ఇప్పటికే భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. అఖిల్ అభిమానులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం కనిపిస్తోంది. ఈ సందర్భంగా విడుదల చేసిన కొత్త పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పోస్టర్‌లో అఖిల్ పూర్తిస్థాయి రస్టిక్ లుక్‌లో సైకిల్ తొక్కుతూ కనిపించడం అభిమానులను ఆకట్టుకుంటోంది. 'ఏజెంట' తర్వాత అఖిల్ నుంచి వస్తున్న ఈ సినిమా ఆయన కెరీర్‌కు కీలకంగా మారనుంది. చాలా కాలంగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న అఖిల్, ఈసారి పూర్తిస్థాయి మాస్ యాక్షన్ కథను ఎంచుకోవడం విశేషం. ఈ చిత్రంలో అఖిల్ సరసన యువ నటి భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. వీరిద్దరి కెమిస్ట్రీ కూడా సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని చిత్ర యూనిట్ చెబుతోంది. ప్రతిష్ఠాత్మకంగా రూపొందుతున్న ఈ సినిమాను అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, మనం ఎంటర్ ప్రైజెస్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంగీత దర్శకుడు ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలపై మంచి అంచనాలు నెలకొన్నాయి. జూలై 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న 'లెనిన' చిత్రం అఖిల్ కెరీర్‌లో అత్యంత కీలకమైన సినిమాగా భావిస్తున్నారు.

ఇరుముడి కట్టు లిరికల్ వీడియో విడుదల

మాస్ మహారాజా రవితేజ హీరోగా దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న డివోషనల్ థ్రిల్లర్ 'ఇరుముడి' సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన తొలి పాట 'ఇరుముడి కట్టు' ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అయ్యప్ప స్వామి భక్తి నేపథ్యంలో రూపొందిన ఈ గీతం భక్తి భావాలను మళ్లీ మళ్లీ గుర్తు చేసేలా ఉండటంతో సోషల్ మీడియాలో మంచి స్పందనను సొంతం చేసుకుంది. సోమవారం చిత్ర బృందం విడుదల చేసిన ఈ లిరికల్ వీడియోలో రవితేజ భక్తి పారవశ్యంలో మునిగిపోయిన తీరు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'స్వామియే శరణం అయ్యప్ప' అంటూ ప్రారంభమయ్యే ఈ పాట, చివరి వరకు భక్తి రసాన్ని కొనసాగిస్తూ శ్రోతలను అలరిస్తోంది. పాటలో అయ్యప్ప మాలధారణలో కనిపించిన రవితేజ, భక్తి భావాలతో నిండిన స్టెప్పులు వేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఆయన లుక్, ఎక్స్‌ప్రెషన్స్, పాట చిత్రీకరణకు సంబంధించిన విజువల్స్ సినిమాపై మరింత ఆసక్తిని పెంచాయి. విడుదలైన కొద్ది గంటల్లోనే ఈ పాట సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే సినిమాలో రెండు అయ్యప్ప స్వామి భక్తి గీతాలు ఉంటాయని ఆయన వెల్లడించారు. అందులో భాగంగా విడుదలైన తొలి పాటకు సంగీతం, ఆర్కెస్ట్రేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ గీతాన్ని గాయకుడు అనంతు తన స్వరంతో అద్భుతంగా ఆలపించారు. పాట సాహిత్యాన్ని దర్శకుడు శివ నిర్వాణ, రచయిత కళ్యాణ్ చక్రవర్తితో కలిసి రాయడం విశేషం. 'ఇరుముడి' సినిమాలో భక్తి, భావోద్వేగాలు, థ్రిల్ అంశాలు సమపాళ్లలో ఉండనున్నాయని సమాచారం. ఫస్ట్ సాంగ్‌కు వస్తోన్న స్పందనను చూస్తుంటే సినిమా సంగీతం కూడా ప్రధాన ఆకర్షణగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఇడుపు కాయితం ఇచ్చంత్రం

డబ్బింగ్, సబ్ టైటిల్స్ అన్నోడు లీడరో, యాక్టరో, రైటరో, డైరోక్టరో, యాపారస్తుడో, చరిత్రకారుడో గాదు.. ఓ దిమాక్ లేని దివానగాడు.. అర్థం తెల్సుకోలేని ఆవారాగాడు. మన భాషను ఎక్కిరిస్తే బరాబర్ అర్సుకోవాల్సిందే. ఒగనాటితోటి ఒడ్సివొయ్యే ముచ్చట. దాన్ని వెబ్ సిరీస్ లెక్క.. సిక్వెల్ లెక్క ఆరం రోజులకాంచి శిగాలుతున్నరు మనోళ్లు. మేధావులు, రచయితల రౌండ్ టేబుల్ మీటింగులు, పేపర్లలో ఆర్టికల్స్, డిజిటల్ మీడియాలో చర్చలు. తెలంగాణ భాష మీద దాడి అనే లెవల్ల నడుస్తుంది. మనం కుత్కులే కూలవడేతట్టు మొత్తుకుంటుంటే.. సైన్మకు ఆ పేరు పెట్టిన ఆంధ్రా నిర్మాత గారో, రచన జేశిన తోపు డైరెక్టర్ గారో ఒక్క మాట మాట్లడలే. ఆఖరికి పైసల్ తీస్కోని యాక్టింగ్ జేశేటోళ్లు గూడ. ఎందుకంటే ఒక్కలిద్దరి దేడ్ దిమాక్ పోస్టులతో సైన్మకు పుక్కట్ల ఫుల్ పబ్లిసిటీ వచ్చే. ఇది మా తెలంగాణ సైన్మ... మేం హిట్ జేస్కుంటం అంటుంటే... సైన్మ బిజినెస్ జేశేటోళ్లు ఫుల్లు ఖుషీ. ఆడెవడో పిచ్చిడో ఒక్క మాట రాస్తే రొండు రాష్ట్రాల పంచాయతీ లెక్క.. రొండు రాష్ట్రాల ప్రజల బతుకు సమస్య లెక్క జెయ్యకుర్రి జర. తెలంగాణ వచ్చినా గూడ హైదరాబాద్ సైన్మ పైత్తనమంత అక్కడోళ్లదే. మన యాసకు డిమాండ్ ఉన్నందుకు మాత్రమే..మన భాష పేరుతో సైన్మలు వస్తున్నయి తప్పితే పాయిరంతో గాదు. పన్నెండేండ్లసంది తెలంగాణ సైన్మ కంపిని డౌలప్ జేశిందేం లేదు. ఆఖరికి గద్దరన్న అవార్డులు గిన అటేపోవట్టే. మనోళ్లకు సైడ్ క్యారెక్టర్లు దొరికితే అదే సంబురం. ఇట్ల రాస్కుంటవోతే సైన్మ ఐతదిని ఆపేస్తున్న. గీ ముచ్చట నచ్చనోళ్లు నా ఫేస్బుక్ అకౌంట్కు ఇడుపు కాయితం ఇవ్వచ్చు.

కర్టెసీ: రఘు భువనగిరి

రెండు సినిమాలే అయినా ఎన్నో యుద్ధాలు చేశాం

రాహుల్ సాంకృత్యాయన్‌కు విజయ్ బర్త్‌డే విషెస్

విజయ్ దేవరకొండ హీరోగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో రానున్న చిత్రం 'రణబాలి'. నేడు రాహుల్ పుట్టినరోజు సందర్భంగా విజయ్ ఆయనకు విషెస్ చెప్పారు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'టాక్సీవాలా'ను గుర్తుచేసుకున్నారు. టాక్సీవాలా' వచ్చి తొమ్మిదేళ్లు దాటింది. ఈ తొమ్మిదేళ్లలో మనమిద్దరం ఎన్నో విషయాల్లో ఎదిగాం. అర్థవంతమైన కథలు రాయాలి.. ప్రేక్షకులను అలరించాలనే నీ పట్టుదలలో.. నీ పాత్రకు ప్రాణం పోయాలనే నా తపనలో ఎలాంటి మార్పు రాలేదు. మనం కలిసి చేసింది కేవలం రెండు సినిమాలే.. అయినా వాటి కోసం ఎన్నో యుద్ధాలు చేశాం. ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నాం. అన్ని అడ్డంకుల మధ్య విడుదలైన మన మొదటి సినిమా. ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంది. ఇప్పుడు రెండో చిత్రానికి కూడా నేను నీకు తోడుగా ఉన్నాను. మనం మళ్లీ ఆ ప్రేక్షకాదరణను పునరావృతం చేద్దాం. విజయాన్ని అందుకుందాం అని విజయ్ దేవరకొండ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. రాహుల్ సినిమాలో భాగమవడం తనకు దక్కిన అదృష్టంగా భావిస్తున్నట్లు విజయ్ తెలిపారు. ఆయన పనితనాన్ని ప్రపంచం చూడబోతున్నందుకు ఎంతో ఉత్సాహంగా ఉందని పేర్కొన్నారు. విజయ్ దేవరకొండకు జోడీగా రష్మిక నటిస్తోన్న ఈ సినిమా సెప్టెంబర్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. 1854 నుంచి 1878 మధ్యకాలంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా 'రణబాలి' చిత్రం రూపొందుతోంది.

This newspaper is Owned and Published by KANTIPUDI RAVENDRA from H. NO. 319, 2ND FLOOR, BHAGATHSINGH NAGAR, PHASE 1, SARDAR PATEL NAGAR, NEAR SRADHA SCHOOL, VENKATESWARA SWAMY TEMPLE KPHB, KUKATPALLY, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500072. Editor: KANTIPUDI RAVENDRA, Printed by BANDLA SAIBABU from PLOT NO. A-22/1, ROAD NO. 14, INDUSTRIAL PARK, NACHARAM, HYDERABAD, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500076. PRGI REGD No.: TGTEL/26/A4986. Phone: 9392666319. Email ID: prabhathakiranam@gmail.com